# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 09 సంచిక :11 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేదీ: ఆదివారం 25-02-2024 పేజీలు:4 వెల: 2.00


## మణిపూర్ యూనివర్సిటీలో బాంబు పేలుడు.. వ్యక్తి మృతి

మణిపూర్ :గత కొన్ని రోజులుగా రెండు జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్ తాజాగా బాంబు పేలుడు తో దద్దరిల్లింది. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని ధనమంజురి యూనివర్సిటీ ప్రాంగణంలో బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు.క్యాంపస్‌లో ఉన్న ఆల్ మణిపూర్ స్టూడెంట్స్ యూనియన్ కార్యాలయం వద్ద పేలుడు ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి 9:25 గంటల ప్రాంతంలో కార్యాలయం తూర్పు వైపున గుర్తుతెలియని దుండగులు బలమైన బాంబును పేల్చినట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు. ఈ ఘటనలో ఓయినమ్ కెనెగి (24), సలామ్ మైఖేల్ అనే ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు తెలిపారు.వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఓయినమ్ కెనెగి ప్రాణాలు కోల్పోయినట్లు వారు వెల్లడించారు. మైఖేల్ మాత్రం తీవ్ర గాయాలతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## బీఆర్ఎస్ కి పెను సవాల్ ...వారంతా నో చెబుతున్నారా...!




హైదరాబాద్,కాలం మహిమ అని అందుకే అంటారు. కాలం నిన్నలా చెప్పడానికి ఎన్నో ప్రతీ మనిషి జీవితంలో కనిపించడం లేదు. ప్రతీ సెకన్ కూడా గతి మారుస్తుంది. అయితే రాజకీయాల్లో ఒడలు బళ్ళు అవుతాయి. ఇపుడు గులాబీ పార్టీలో అదే ఏర్పడింది. బీఆర్ఎస్ అంటే ఆ సౌండే వేరుగా ఉండేది.ఏమ సందడి ఏమ హడావుడి అన్నట్లుగా కనిపిస్తుంది. కేసీఆర్ అంటే అపర చాణక్యుడే అనేవారు. మాకు కొండంత అండ కేసీఆర్ ఉండగా దిగులేలా అన్న చర్చ కూడా చేస్తూ వచ్చేవారు. కేవలం మూడు నెలల ముందు వరకూ ఇదే సీన్. ఇపుడు మాత్రం అంతా ఉల్టా సీదా అయిపోయింది. బీఆర్ఎస్ ని చూస్తే ఏవీ నాటి వైభోగములు అని అనుకోకతప్పదు.బీఆర్ఎస్ కి ఇపుడు అసలైన అగ్ని పరీక్షగా ఎంపీ ఎన్నికలు వచ్చాయి. ఇదంతా కేసీఆర్ చేసుకున్నదే. ఆయన 2014లో ఎన్నికల్లో పోటీ చేసినపుడు ఎంపీ ఎమ్మెల్యే ఎలక్షన్ ఒకేసారి సాగింది. అదే 2018 నాటికి ఆరు నెలల ముందు ఎన్నికలు అనుకుంటూ వెళ్లారు. అసెంబ్లీలో సక్సెస్ కొట్టారు. అదే లోక్ సభ నాటికి సగం ఎంపీ సీట్లు అయ్యాయి.అయినా చేతిలో రాష్ట్ర అధికారం ఉంది కాబట్టి ఆ తక్కువ సీట్లు ప్రభావం చూపించలేదు. ఇపుడు రెండు సార్లు ఎన్నికలు రెండు పోటీలు మాత్రం ఓడిన పార్టీగా బీఆర్ఎస్ కి పెను సవాల్ గానే మారుతున్నాయని అంటున్నారు. డిసెంబర్ లో ఓటమి సంభవించింది. దాని నుంచి తేరుకునేలోగా తొడగొట్టి కాంగ్రెస్ మరో ఎన్నికకు పిలుస్తోంది.ఈ రకమైన పరిస్థితి కర్ణాటకలో లేదు. అక్కడ కూడా 2023లో ఎన్నికలు జరిగినా పార్లమెంట్ ఎన్నికలకు చాలా సమయం ఉంది. దాంతో ప్రభుత్వ వ్యతిరేకత ఎంతో కొంత ఉన్నా దాని నుంచి లబ్ది పొందేందుకు అక్కడ బీజేపీ జేడీఎస్ తో జతకట్టి మరీ రంగంలోకి దిగుతోంది. తెలంగాణాలో అంతా పచ్చిగానే ఉంది.దానితో పాటు ప్రజల మైండ్ సెట్ కూడా అలాగే ఉంది. కాంగ్రెస్ కే మరోమారు చేయెత్తేలా ఓటర్లు ఉన్నారు. బీజేపీ జాతీయ పార్టీగా ఉంది. కాబట్టి మోడీ వేవ్ ఏమైనా ఉంటే ఆ వైపుగా కొన్ని ఎంపీ సీట్లు టర్న్ అవుతాయి. మరి బీఆర్ఎస్ కి ఏమి మిగులుతుంది అంటే ఆలోచించాల్సిందే అంటున్నారు.ఎన్నికలు తరుముకుని వస్తున్న వేళ బీఆర్ఎస్ మొత్తం 17 ఎంపీ సీట్లలో అభ్యర్ధుల ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నా పూర్వపు ఉత్సాహం అయితే ఎవరిలోనూ లేదని అంటున్నారు. ఎందుకంటే సర్వేలు సంగతి పక్కన పెడితే జనం పల్స్ ఈ మధ్యనే చూశారు. దీంతో బీఆర్ఎస్ నుంచి ఎంపీ పోటీ అంటే కొందరు నేతలు సున్నితంగా తప్పుకుంటున్నారు అని ప్రచారం సాగుతోంది.నిజానికి ఎంపీ టికెట్ కోసం క్యూలు కట్టాల్సిన చోట ఇపుడు ఎందుకొచ్చిన పోటీ అని అనుకుంటున్నారు అంటే జనం నాడిని పట్టిన రాజకీయ నేతలు కాబట్టే అంటున్నారు. ఎంత పోటీ చేసినా ఎంతగా తగలేసుకున్నా జనం అయితే ఈ అతి తక్కువ సమయంలో మనసు మార్చుకోరని ఫలితంగా మరోసారి ఓటమి భారం నెత్తిన ఎందుకు మోయాలీ అన్నంతో సీనియర్ల నుంచి చాలా మంది తమకు టికెట్ వద్దు అని చెబుతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.దీంతో అర్ధబలం అంగబలం ఉన్న నేతలను ఏరి మరీ పోటీకి నిలబెట్టడం గులాబీ పార్టీకి కత్తి మీద సాముగా అని అంటున్నారు. అభ్యర్ధులు దొరుకుతారు కానీ వారంతా గెలుపు గుర్రాలేనా అంటే డౌట్ పడాల్సి ఉంటుంది. అలాగని ఏదో పోటీ పెట్టాం అన్నట్లుగా ఉండకూడదు, ఒక విధంగా చెప్పాలి అంటే బీఆర్ఎస్ లాంటి పార్టీలకు ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్య.ఈసారి ఎన్నికల్లో కనుక కనీసంగా సీట్లు తెచ్చుకోకపోతే ఇబ్బంది. దాంతో గులాబీ కోటలో దీని మీదనే చర్చ సాగుతోంది. గట్టి అభ్యర్ధులను పెట్టి అధికార కాంగ్రెస్ ని ఢీ కొట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధం కావాల్సి ఉంది. ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నాలు ఎంతమేరకు ఫలితాలు ఇస్తాయో చూడాల్సి ఉంది.

## రేవంత్ వ్యూహం అదుర్స్..బీజేపీ,బీఆర్ఎస్‌లో ఆందోళన

హైదరాబాద్,తెలంగాణలో కాంగి'రేసు' వేరే లెవెల్లో ఉంది. సీఎం రేవంత్ రెడ్డి చురుకైన వ్యూహాలతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. టీపీసీసీ ప్రెసిడెంట్‌గా, సీఎంగా ద్విపాత్రాభినయం చేస్తున్న రేవంత్ రెడ్డి.. రెండు పాత్రల్లోనూ తనదైన మార్క్‌ను ప్రదర్శిస్తున్నారు. రాత్రికి రాత్రే కొత్తకొత్త నిర్ణయాలు, వ్యూహాలతో ప్రత్యర్థుల వ్యూహాలకు చెక్ పెడుతున్నారు. మూడు రోజుల క్రితం కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించిన విషయం తెలిసిందే. కొస్గీ బహిరంగ సభలో రేవంత్ ప్రసంగం కార్యకర్తల్లో కొత్త జోష్‌ను నింపింది.యుద్ధం ముగియలేదు, అసలైన యుద్ధం ఇప్పుడే ప్రారంభమైంది. విశ్రాంతి వద్దు. కదన'రంగంలోకి దూకండి అంటూ కార్య'కర'ల'కు రేవంత్ ఏర్పాటు. లోక్ సభ ఎన్నికలలో తెలంగాణలోని 17 స్థానాలకు గాను 14 స్థానాల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాల్సిందేనని, ఆ మేరకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలంటూ రేవంత్ సూచించారు. అంతేకాదు పార్లమెంట్ ఎన్నికల కోసం అభ్యర్థులను సైతం రేవంత్ ప్రకటిస్తున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా వంశీచందర్ పేరును రేవంత్ ప్రకటించారు. మరో వారం రోజుల్లో మిగిలిన అన్ని స్థానాల్లో అభ్యర్థుల'ను ప్రకటిస్తామ'ని క్లారిటీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో రేవంత్ దూకుడు, వ్యూహాలను చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం, సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించడంలో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. ప్రజా ఇబ్బందులను తొలగించే విధంగా రేవంత్ పాలన సాగుతుండడంతో గ్రామం స్థాయిలో పార్టీకి ప్రజాదరణ రోజు రోజుకు పెరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్, బీజేపీలకు మద్దతుగా నిలిచిన వారిలో అధిక శాతం మంది.. రేవంత్‌రెడ్డి పాలనను మెచ్చి కాంగ్రెస్‌కు జై కొడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకే ఓటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు దాదాపు ఖాయమైన ట్లేనని పలు సంస్థలు నిర్వహించిన సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయి. రెండు నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీకి అనూహ్యంగా ప్రజల నుంచి మద్దతు పెరగడంతో బీఆర్ఎస్ పార్టీలోని సిట్టింగ్ ఎంపీలు, ద్వితీయ శ్రేణి నేతలు, పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే భారీ సంఖ్యలో బీఆర్ ఎస్ పార్టీకి చెందిన ముఖ్యనేతలు రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రేవంత్ దూకుడు పాలన తీరు నచ్చి మెచ్చి పార్టీ నుంచి కీలక నేతలు చేజారుతుండటంతో బీఆర్ ఎస్ నేతల్లో ఆందోళన నెలకొంది. అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యూహాలకు తిరుగులేకుండా ఉండేది. కానీ, అధికారం కోల్పోయాక.. కేసీఆర్ వ్యూహాలను రేవంత్ చిత్తుచేస్తున్నారని బీఆర్ ఎస్ నేతలుసైతం అంగీకరిస్తున్నారు.తెలం గాణాలో మొత్తం 17 పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో అధికార ంలో ఉన్న బీఆర్ ఎస్ తొమ్మిది నియోజకవర్గాల్లో విజయం. బీజేపీ నాలుగు నియోజకవర్గాల్లో, కాంగ్రెస్ మూడు నియోజకవర్గాల్లో, మజ్లిస్ ఒక నియోజకవర్గంలో విజయం సాధించింది. ప్రస్తుతం బీఆర్ ఎస్ అధికారాన్ని కోల్పోవడంతో ఆ పార్టీ శ్రేణులు నిరాశకు గురయ్యారు. దీనికి తోడు కొందరు ముఖ్యనేతలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇటీవల పలు సంస్థలు



వెల్లడించిన సర్వేల్లో బీఆర్ ఎస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో రెండు నుంచి మూడు పార్లమెంట్ స్థానాలు మాత్రమే గెలిచే అవకాశం ఉందని తేలింది. సీఎం రేవంత్ రెడ్డి దూకుడుతో కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోంది. దీంతో ఆ పార్టీకి 10 నుంచి 12 వరకు నియోజకవర్గాల్లో విజయం సాధించడం ఖాయమని సర్వే ఫలితాలు తేటతెల్లం అవుతున్నాయి. బీజేపీకి మూడు నుంచి నాలుగు, మజ్లిస్‌కు ఒక పార్లమెంట్ స్థానం దక్కే అవకాశం ఉందని సర్వేల ఫలితాలు చెబుతున్నాయి. అయితే, కొస్గీ బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 14 లోక్ సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించాలని, ఆ మేర'కు పార్టీ నేతలు, కార్యకర్త'లు కృషి చేయాలని కోరుతున్నారు. రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి తనదైన రీతిలో పాలన సాగిస్తున్నారు. గత బీఆర్ ఎస్ హయాంలో అవినీతి అక్రమాలను వెలికితీస్తూనే.. పదునైన వ్యూహాలతో ప్రత్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. రేవంత్ దూకుడుతో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 14 నుంచి 15 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం ఖాయమని ఆ పార్టీ నేతలు ఎదురుచూస్తున్నారు. గతంలో ఎన్నికల సమ' కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో విషయంలో హైకమాండ్ ఆచితూచి అడుగులు వేసేది. దీనితో ఆలస్యంగా అభ్యర్థుల జాబితాలు విడుదల య్యేవి. కానీ రేవంత్ రెడ్డి ఆ విధానానికి స్వస్తి పలికినట్లు కనిపిస్తోంది. ముందుగానే అభ్యర్థుల'ను ప్రకటిస్తూ కాంగ్రెస్ శ్రేణుల్లో కన్ఫ్యూజ్ లేకుండా చేస్తున్నారు. ఇప్పటికే మహబూబ్ నగర్ పార్లమెంట్ అభ్యర్థిని ప్రకటించిన రేవంత్.. మరో వారం రోజుల్లో మిగిలిన నియోజకవర్గాల్లో అభ్యర్థుల జాబితాను వెల్లడించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకటి రెండు చోట్ల మినహా ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికను రేవంత్ పూర్తిచేశారని చెప్పారు. ఆ మేరకు హైకమాండ్ నుంచి సైతం గ్రీన్ సిగ్నాల్ వచ్చేసిందన్న చర్చ కాంగ్రెస్‌లో వినిపిస్తోంది. 14 నియోజక'వర్గాల్లో విజయమే లక్ష్యంగా రేవంత్, కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ దుకుతో బీఆర్ ఎస్, బీజేపీ నేతల్లో కలవరం మొదలైందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ముందే అర్థుల'ను ఖరారు చేయాలంటూ పార్టీ నేతలు ఆయా పార్టీల అధిష్టానాలపై ఒత్తిడి పెంచుతున్న అభ్యర్థనలు. మొత్తానికి రేవంత్ రెడ్డి వ్యూహాలు బీఆర్ ఎస్, బీజేపీ అధిష్టానాలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయంటూ పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతుంది.

## రేవంత్ వర్సెస్ జగన్... ఏపీలో కొత్త సీన్...!

హైదరాబాద్,తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పాలన చేస్తున్నారు. ఆయన కేసీఆర్ అనే పొలిటికల్ లెజెండ్ ని గద్దె దించారు. కాంగ్రెస్ వంటి పార్టీలో అందరికీ ఆమోదయోగ్యమైన నేతగా మారిపోయారు. ముఖ్యమంత్రిగా తన మార్క్ ని చూపిస్తున్నారు. మూడు నెలల రేవంత్ రెడ్డి పాలన చూసుకుంటే బాగానే ఉంది అంటున్నారు. ఇటీవల సర్వేలు సైతం మరోసారి కాంగ్రెస్ దే విజయం అని చెబుతున్నాయి. ఎపుడు పార్లమెంట్ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ కే ఎక్కువ ఎంపీ సీట్లు వస్తాయని జోస్యాలు వెలువడుతున్నాయి. అలా సక్సెస్ ఫుల్ లీడర్ గా ఉన్న రేవంత్ రెడ్డిని ఏపీకి తీసుకుని వచ్చి అక్కడ హస్త రేఖలు సరిచేసుకోవాలని కాంగ్రెస్ పెద్దలు ఆలోచన చేస్తున్నారు. అది సహజం కూడా. ఉమ్మడి ఏపీగా రెండు ప్రాంతాలూ ఒక్కటే. విభజన జరిగినా ఏపీలోనూ అదే రాజకీయం ఉంటుంది. దాంతో రేవంత్ రెడ్డి తెలంగాణా వరకూ బేఫికర్ గా ఉన్నారు కాబట్టి ఏపీ ఎన్నికల మీద కొంత ఫోకస్ పెట్టే అవకాశం ఉందని అంటున్నారు. ఏపీలో రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అంతే కాదు ఆయన అనేక ప్రాంతాలు నగరాలలో బహిరంగ సభలు నిర్వహించి కాంగ్రెస్ కి కొత్త బలం ఇస్తారని అంటున్నారు. ఇక్కడ మరో విషయం కూడా ప్రచారంలో ఉంది. ఏపీ కాంగ్రెస్ పదేళ్లుగా అధికారం లేక చితికిపోయింది. ఒక్క ఎమ్మెల్యే కూడా లేకుండా పోరు సాగుతోంది. అందువల్ల కాంగ్రెస్ కి అంగబలం అర్ధబలం కూడా తెలంగాణా నుంచి సమకూర్చాల్సి ఉంటుంది. ఈ విషయంలో రేవంత్ రెడ్డి చొరవ తీసుకుంటున్నారని అంటున్నారు. రేవంత్ దూకుడు అదే విధంగా తెలంగాణా ఎన్నికల్లో తనదైన వ్యూహంతో పార్టీని విజయతీరాలకు చేర్చిన రేవంత్ రెడ్డి కూడా కొత్త వ్యూహరచన చేస్తారని అంటున్నారు. అయితే ఆయన ఎన్నికల ప్రచారం ఏపీలో స్టార్ట్ చేస్తే జగన్ మీద సరికొత్త విమర్శలు ఏపీ జనాలు కచ్చితంగా ఉంటాయని అంటున్నారు. నిజానికి రేవంత్ రెడ్డి జగన్ ల మధ్య పెద్దగా పరిచయాలు లేవు. ఇద్దరి రాజకీయ తోవలు వేరు. ఇద్దరూ అసలైన రాజకీయాన్ని 2009 ఎన్నికల ఆధారంగా. ఇక



ఇద్దరూ ఒకే ఈడు వారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. ఈ నేపథ్యంలో నుంచి చూసినపుడు రేవంత్ రెడ్డి మాటల దూకుడు చేస్తారు అని పేరు వచ్చింది. ఆయన మాటలు పంచులకు తెలంగాణాలో యూత్ అభిమానులుగా మారిపోయారు. ఏపీలో రేవంత్ కి కూడా క్రేజ్ ఉందని అంటున్నారు. అలా ఆయన ఏపీలో తనదైన శైలిలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపుని అయితే తీసుకుని వస్తారు అని అంటున్నారు. అయితే రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్న జగన్ ని మాత్రమే విమర్శించి ఊరుకుంటారా లేక ప్రతిపక్షంలో చంద్రబాబుని కూడా విమర్శిస్తారా అన్నదే ఇక్కడ కీలక పాయింట్. ఆయన బాబుని పక్కన పెట్టి జగన్ మీదనే విమర్శలు చేస్తే విని ఎంజాయ్ చేస్తారు తప్ప ఫలితం ఉండదు. అలా కాకుండా ఏపీలోని మొత్తం పొలిటికల్ గ్రౌండ్ లో ఉన్న అన్ని పార్టీలను విమర్శిస్తే కాంగ్రెస్ కి ఓటు బ్యాంక్ పెరిగే ఛాన్స్ ఉంది. ఇక ఇప్పటిదాకా జగన్ మీద పెద్దగా విమర్శలు చేయని రేవంత్ రెడ్డి ఏపీకి వచ్చి బిగ్ సౌండ్ చేస్తే అపుడు రాజకీయం కొత్త మలుపు తిరుగుతుంది అని దానికి బదులు జగన్ నుంచి వైసీపీ నేతల దాకా ఇచ్చే ఛాన్స్ ఉంటుంది. అలా ఏపీ రాజకీయం రసకందాయంలో పడుతుంది అని అంటున్నారు.

## 42 సీట్లలో మేమే పోటీ చేస్తాం: తృణమూల్ కాంగ్రెస్



న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్(తృణమూల్ కాంగ్రెస్) పార్టీ అన్నింటిలో పోటీ చేసేందుకు రెఢీగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ మొత్తం 42 స్థానాల్లో పోటీ చేయనున్న వర్గాల ద్వారా కొన్ని వర్గాలలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉంటుందోని ఊహాగానాలు వినిపిస్తున్నా.. ఆ అంశంపై క్లారిటీ దొరకడం లేదు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ ఇటీవల కొన్ని వ్యాఖ్యలు చేశారు.బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 42 స్థానాలలోనూ పోటీ చేసేందుకు సుముఖం ఉందని ఒబ్రెయిన్ చెప్పారు. అస్సాంలో కొన్ని సీట్లు, మేఘాలయాలోనూ పోటీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎటువంటి మార్పులు ఉండబోవ ని ఒబ్రెయిన్ ఇటీవల చెప్పారు. అయితే తుదికు ఎటువంటి మార్పు ఉంటుందో అంచనా వేయడం కష్టంగానే ఉంది.కాంగ్రెస్ ని ఇండియా కూటమి ఇటీవల యూపీ, ఢిల్లీ రాష్ట్రాల్లో సీట్ల పంపకంపై ఓ ప్రకటన చేసింది. యూపీలో ఎస్పీతో కలిసి కాంగ్రెస్ పోటీచేయనున్నది. ఇక ఢిల్లీ, గుజరాత్, గోవా, హర్యానా రాష్ట్రాల్లో ఆమ్ ఆద్మీతో కలిసి పనిచేయనున్నది.

## రాజధానిపై కొడాలి నాని ఆసక్తికర కామెంట్స్



అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాజధానిపై మాజీ మంత్రి కొడాలి నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కృష్ణాజిల్లా గుడివాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోని రాష్ట్రాల రాజధానులన్నీ వందల ఏళ్ల క్రితం ఏర్పడ్డాయన్నారు. అవే ఇప్పుడు మెగా సిటీలుగా మనకు కనపడుతున్నాయని చెప్పారు.పొలాల్లో రాజధాని ఎలా కడతామని కొడాలి నాని నిలదీశారు. చంద్రబాబు నాయుడు వాస్తవాలకు దూరంగా రాజధాని గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. రాజధాని రైతులు ఏం త్యాగం చేశారని కొడాలి నాని ప్రశ్నించారు. చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ వంటి ఏ రాజధానిలోనైనా 150 ఎకరాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఉంటాయని తెలిపారు.మిగిలిన 99 శాతం ప్రైవేట్ ఆస్తులుగా ఉంటాయని కొడాలి నాని చెప్పారు. రాజధాని నిర్మిస్తానంటూ 33 వేల ఎకరాలు తీసుకొన్న చంద్రబాబు పిట్టలదొరలా కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఏపీలో ప్రజా సమస్యలను నేరుగా పరిష్కారమయ్యే వ్యవస్థను జగన్ సృష్టించారని అన్నారు. రాజధాని కడతానని గ్రాఫిక్స్‌తో చంద్రబాబు నాటకాలు ఆడారని చెప్పారు.వారిద్దరిలో ఎవరు గొప్పో ఆలోచించుకోవాలని కొడాలి నాని అన్నారు. ఒక్కడే రాజధాని కట్టడం అనేది సాధ్యం కాదని చెప్పారు. 120 సార్లు బటన్ నొక్కి పేద ప్రజల ఖాతాల్లో సీఎం జగన్ డబ్బులు వేశారని తెలిపారు. కోట్లాదిమంది ప్రజలు ఏమైపోయినా చంద్రబాబు, పవన్, బీజేపీకి అనవసరమని చెప్పారు. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలో పూర్తిగా తెలిసిన వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. మే నెలలో సీఎంగా జగన్ ప్రమాణం చేయకుండా ఆపగలిగే శక్తి ఏపీలో ఏ రాజకీయనాయకుడికీ లేదని చెప్పారు.

## మార్చి 1న వైజాగ్ లో ప్రధాని మోదీ పర్యటన

హైదరాబాద్,ప్రధాని మోడీ మార్చి 1న విశాఖపట్నం పర్యటనకు రానున్నారు. మొదట ఏయూ ఇంజినీరింగ్ కాలేజీలో బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం రూ.26,264 కోట్లతో HPCL విస్తరణ ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నారు. సబ్బవరంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం యూనివర్సిటీ, ఓఎన్జీసీ ప్రాజెక్టుతో కలిపి మొత్తం 11 ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మైక్రోబయాలజీ ల్యాబ్‌ను ప్రధాని మోదీ ఈ నెల 26న 'వర్చువల్'గా ప్రారంభిస్తారు. గతంలో దీనికి ఉన్న ప్రాంతీయ ఫుడ్ ల్యాబొరేటరీ హోదాను కేంద్రం రూ.4.5 కోట్లతో రాష్ట్ర స్థాయికి పెంచింది. అత్యాధునిక పరికరాల కోసం రూ.14 కోట్లను కేటాయించి.. ఇప్పటికే రూ.8 కోట్లను విడుదల చేసింది. పూర్తిస్థాయిలో పరికరాలు, యంత్రాలు సమకూరితే ఏడాదికి సుమారు 20 వేల ఆహారం, నీటి నమూనాలను పరీక్షించేందుకు వీలుగా ఏర్పడుతుంది. దీనితో పాటు ప్రభుత్వానికి అదనంగా ఆదాయం సమకూరుతుంది.మరోవైపు గుంటూరు ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో, తిరుపతిలోని టీటీడీ భవనంలోనూ



రాష్ట్ర స్థాయి ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.18 కోట్ల చొప్పున విడుదల చేసేందుకు కేంద్రం ఆమోదం విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2.07 కోట్లతో తీసుకొచ్చిన నాలుగు ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ ల్యాబ్‌లను కూడా ప్రధాని ప్రారంభించనున్నారు.

## సంపాదకీయం

**ఆదివారం 25-02-2024**

# ఆర్థిక గడ్డు పరిస్థితులకు తోడు నిరుద్యోగం

దేశంలో ఆర్థిక గడ్డు పరిస్థితులను గట్టెక్కించే ప్రయత్నాలు సాగడం లేదు. రూపాయి విలువ క్రమంగా పడిపోతోంది. బంగారం, వెండి ధరలు సామాన్యులకు దూరంగా ఉన్నాయి. గృహనిర్మాణరంగం గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదన్న ధోరణి కొనసాగుతోంది. హైదరాబాద్ లాంటి నగరంలో మధ్యతరగతి వారు కనీసం ఓ ఫ్లాట్ కూడా కొనలేని దుస్థితి ఉంది. పెరుగుతున్న సిమెంట్, ఐరన్, ఇతర సామాగ్రిధరలకు తోడు బిల్డర్ల దోపిడీ కారణంగా ప్రజలకు గృహం అన్నది కలలా తయారయ్యింది. ఈ పరిస్థితులను అధ్యయనం చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అయ్యారు. బియ్యం ధరలు నానాటికి పెరుగుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా బియ్యం ధరలు అదుపులోకి రావడం లేదు. గ్యాస్, ఇళ్లు ఇచ్చాం.. బాత్‌రూమ్‌లు కట్టించాం.. వికసిత భారత్ అంటూ ప్రకటనలతో ఊదరగొడుతున్నారు. క్షేత్రస్థాయిలో బిజెపి నేతలు మోడీ జపం చేయడం తప్ప సమస్యలను అధ్యయనం చేసి కేంద్రానికి నివేదిక ఇవ్వడం లేదు. ఇకపోతే ఉద్యోగాల కల్పన జరగడం లేదు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించే కార్యక్రమం చేయడం లేదు. ఐటి ఉద్యోగాలు ఎండమావిలా తయారయ్యాయి. ఎప్పుడు ఊడుతుందో తెలియని ఉద్యోగంతో కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. ఉద్యోగాల తొలగింపులపై కంపెనీలు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగా వేలాది కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంటోంది. స్వదేశంలోనూ, విదేశంలోనూ వరుసగా ఉద్యోగాలు తొలగిస్తూ పోతున్నారు. ఉద్యోగాలను ఆఫర్ చేసి..తీరా ట్రైనింగ్ పూర్తయ్యాక సగం జీతాలే ఇస్తామంటున్న కంపెనీల నిజాయితీ ఏమిటో తెలుస్తుంది. పెరుగుతున్న ధరలతో మార్కెట్‌లో ఇప్పటికే తీవ్ర సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఉద్యోగుల పట్ల సానుభూతితో వ్యవహరించి ..జీతాలు కొంచెం తగ్గించి లేదా బోనస్‌లు లాంటివి ఇవ్వకుండా వారికి ఉద్యోగ భద్రత కల్పించి ఉంటే ఆయా కంపెనీల నిజాయితీ నిలిచేది. కానీ ఉద్యోగాలు తొలగిస్తే ఆ కుటుంబాలు ఏమయిపోతాయన్న కనీస ఆలోచన లేకుండా...సామాజిక బాధ్యతను కంపెనీలు విస్మరిస్తు న్నాయి. ఉద్యోగులను తొలగిస్తూ ఐటి సంస్థలు వరుసగా తీసుకుంటున్న నిర్ణయాలు ఆందోళన కలిగిస్తు న్నాయి. ఈ పర్య సమాజంలో తీవ్ర అశాంతికి కారణమవుతుందన్న బాధను పట్టించుకోవడం లేదు. ఆయా దేశాల ప్రభుత్వాలు కూడా వీటిని పట్టించుకోవడం లేదు. ఇకపోతే ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో అధిక సంఖ్యాకులు భారతీయులేనన్న విషయం మరింత కలవరాన్ని కలిగిస్తోంది. ఇంత జరుగుతున్న మనదేశంలో పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదు. అధికారంలో ఉంటూ దోపిడీలకు పాల్పడుతున్నారు తప్ప అభివృద్ధి గురించి, ప్రజల గురించి ఆలోచించడం లేదు. వారిని ఎలా ఆదుకోవాలో అన్న ఆలోచన చేయడం లేదు. ఉద్యోగాలు పోయిన వారికి వారు అండగా నిలుస్తారన్న ఆశా లేదు. ఓ సంస్థ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 965 కంపెనీలు 1.50లక్షల మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. 2023లో కూడా ఈ తొలగింపు పక్రియ కొనసాగింది. ఇప్పటికీ తొలగిస్తూనే ఉన్నారు. ఒక్కో నెలలో రోజుకు సగటున 3 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారని అంచనా! అనేక చిన్నాచితక కంపెనీలతో పాటు అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ ఐటి సంస్థలు కూడా ఉద్యోగులను సాగనంపే పక్రియలో పోటీ పడుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది కాలంలో భారతదేశంలో ఉద్యోగాలు పోగొట్టు కున్న టెకీల సంఖ్య 25 వేల దాకా ఉంటుందని అంచనా. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కంపెనీలు తొలగించిన వారిలో 40 శాతం మంది భారతీయులే అని వివిధ సంస్థలు తేల్చి చెబుతున్నాయి. రానున్న రోజుల్లో కోల్పోయే ఉద్యోగాల్లోనూ భారతీయులే అధికంగా ఉంటారని కూడా ఆ సంస్థలు పేర్కొంటున్నాయి. అదే జరిగితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు పోగొట్టుకున్న భారతీయ యువత పరిస్థితి గందరగోళంగా మారింది. దీనికితోడు హెచ్1బి వీసాల నిబంధనలు వారి పరిస్థితిని మరింత అయోమయానికి గురిచేస్తున్నాయి. దీంతో వేలాదిమంది భారతీయ యువతీయువకులు దేశం కానీ దేశంలో ఉద్యోగాల వేటలో మునిగిపోయారు. ఇప్పుడిది సమాజంలో అశాంతికి కారణం కానుంది. గుడ్డిలో మెల్లలాగా వీటిలో కొన్ని సంస్థలు ముందస్తు నోటీస్‌తో పాటు, కొంత మేరకు పరిహారం ఇస్తున్నాయి. మరి కొన్ని సంస్థలు అటువంటివేమి లేకుండానే లే ఆఫ్ కాగితాన్ని చేతుల్లో పెడుతున్నాయి. వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా ఇళ్ల దగ్గర పనిచేస్తున్న సిబ్బందిని అత్యవసర సమావేశం పేరుతో ఆఫీసుకు పిలిపిస్తున్న పలు కంపెనీలు తొలగింపు లేఖలను చేతుల్లో పెడుతున్నాయి. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. ఇలాంటి వారికోసం ఏం చేయాలో మన ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు, వీరికి భృతి కల్పించడంపై చర్యలు తీసుకోవాలి. ఇది కేంద్రం బాధ్యత మాత్రమే కాదు. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఉమ్మడిగా ఆలోచన చేయాలి. ఉద్యోగాలు వెతుక్కుంటూ వెళ్లి విదేశాల్లో స్థిరపడుతున్నారని భావిస్తున్న తరుణంలో ఇక్కడి వారికి తీరని మానసిక క్షోభను తెచ్చి పెడుతోంది. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. కనీసం భరోసా ఇవ్వడం లేదు. ఆదుకుంటా మన్న ఉపశమన వాక్కులు కూడా రావడం లేదు. పెద్దసంఖ్యలో భారతీయ యువత విదేశాలలో రోడ్డున పడుతున్నా ఇంతవరకు ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. దేశీయంగా కంపెనీలకు భారీగా రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు ఉద్యోగాల తొలగింపుపై కంపెనీలను నిలదీయాలి. కఠిననిబంధనలు విధించాలి. ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత కంపెనీలదే అని స్పష్టంగా తెలియచేయాలి. ఇష్టం వచ్చినట్లుగా తొలగిస్తే వారికి అండగా ఉన్నామన్న విషయం గుర్తు చేయాలి. ప్రభుత్వాలే ఈ బాధ్యత తీసుకుంటే తప్ప సమస్యకు పరిష్కారం దక్కదు. విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు భరోసా కలిగించే చర్యలు చేపట్టాల్సిన పాలకులు కనీస చర్చ కూడా చేయడం లేదు. పార్లమెంటులో సమస్యలు చర్చించడం లేదు. ఈ సమయంలో ఓటర్లు రేపటి ఎన్నికల్లో పాలకులను నిలదీయాలి. ఇలాంటి సమస్యలపై చర్చ పెట్టాలి. గ్రామస్థాయిలో పార్టీల తీరును ఎండగట్టాలి.

# రెడ్‌సీపై దాడుల ప్రభావం

గత సంవత్సరం అక్టోబర్‌లో హమాస్, ఇజ్రాయెల్ మధ్య వివాదం తీవ్ర రూపం దాల్చింది. ఈలో అమెరికా, యునైటెడ్ కింగ్డమ్ (యుకె) దేశాలు ఇజ్రాయెల్‌కి వివాదానికి మద్దతుగా నిలిచాయి. ఇరాన్ దేశం హమాస్‌కి మద్దతుగా నిలిచింది. ఇరాన్ మద్దతు గల హౌతి తిరుగుబాటుదారులు ఎలాగైనా అమెరికా, యుకె దేశాలపై ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా అమెరికా, యుకె దేశాల వాణిజ్య నౌకలపై దాడులు చేయడానికి నిర్ణయించుకున్నారు. ఈ దాడులకు అనువైన ఎర్ర సముద్రాన్ని ఎంచుకొని దాడులకు తెగబడ్డారు. మధ్యధరా సముద్రం, ఎర్ర సముద్రాన్ని కలిపే కెనాల్‌ని సూయెజ్ కెనాల్ అంటారు. ఆ సూయెజ్ కెనాల్ గుండా వెళ్లే నౌకలను హౌతి మిలిటెంట్లు దాడి చేస్తున్నారు. ఇదే మార్గంలో భారత దేశ వాణిజ్య నౌకలు కూడా ప్రయాణిస్తాయి. ఈ దాడుల కారణంగా భారత నౌకలు ప్రత్యామ్నాయ మార్గమైన దక్షిణాఫ్రికా గుండా వెళ్ళవలసి వస్తుంది. ఈ మార్గం గుండా ప్రయాణించడం ద్వారా ప్రయాణ ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇది భారత ఆర్థిక పరిస్థితిపై ఇప్పటికిప్పుడు ప్రభావం చూపనప్పటికీ, ప్రపంచ వాణిజ్యంలో మల్టీప్లైయిర్ ప్రభావం కారణంగా ఇది భారత వాణిజ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. పశ్చిమ దేశాలలో ఇటీవల సంఘటనల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని భారతీయ షిప్పింగ్ కంపెనీలు ఆందోళన కొనసాగుతున్నవి. ఆర్‌ఆర్బి షిప్ చాటరింగ్ కంపెనీ ప్రకారం హౌతి దాడుల వలన షిప్పింగ్ ఖర్చులు దాదాపు మూడు రెట్లు పెరిగాయి. ఎర్ర సముద్రంలో జరిగిన ఈ సంఘటనలు షిప్పింగ్ పరిశ్రమకు ఆందోళన కలిగిస్తున్నాయి . సముద్రంలో జరిగిన ఈ సంఘటన వెలుగులోకి రావడంతో కార్గో కంపెనీల యూరప్ వెళ్లే గృహాలు సూయెజ్ కెనాల్ బదులుగా కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గంలో వెళు తున్నాయి. ఇలా షిప్పింగ్‌లు దారి మరలించడం వలన రవాణా ఖర్చు దాదాపు 3 రెట్లు పెరిగింది. ఎర్ర సముద్రం భారత దేశానికి షిప్పింగ్ మార్గంలో ముఖ్యమైనది. భారత దేశం ఈ మార్గం ద్వారా యూరప్, పశ్చిమాసియా, ఆఫ్రికాకు ఎగుమతులు చేస్తుంది.సూయెజ్ కెనాల్ అనేది ఆసియా నుండి యూరప్ వెళ్లే అతి తక్కువ దూరం గల జలమార్గం, దానిని చేరుకోవడానికి ఓడలు ఎర్ర సముద్రం గుండా వెళ్లాలి. భారత దేశం ఎగుమతుల్లో దాదాపు 34% యూరప్, అమెరికా తూర్పు తీరానికి జరుగుతోంది. మన ఎగుమతులలో ప్రధానమైనవి ఉక్కు, ఇంజినీరింగ్ వస్తువులు, వస్త్రాలు, బాస్మతి బియ్యం, చేపలు, ఇతర ఆహార ఉత్పత్తులు. ఇవి ప్రధానంగా ఆఫ్రికా ఇంకా పశ్చిమ దేశాలకు ఎర్ర సముద్రం గుండా ఎగుమతి చేయబడుతున్నాయి. ఇతర ప్రత్యామ్నాయ మార్గమైన కేప్ ఆఫ్ గుడ్ హోప్ నుంచి నౌకాయానం చేయడం వల్ల దాదాపు 10- 14 రోజుల అధిక సమయం పడుతుంది. ఇలా అధిక సమయం పట్టడం వలన మన ఎగుమతి చేసే చేపలు, ఇతర ఆహార పదార్థాల నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయి పాడైపోయే అవకాశం ఉంది. వలన తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అంతే కాకుండా అధిక ఇంధన వినియోగం వల్ల ఆర్థిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అనేక బీమా కంపెనీలు ఎర్ర సముద్రంలో సరఫరా చేసే ఓడలకు ప్రీమియంలను 100 రెట్లు పెంచాయి. ఇంకా కొన్ని బీమా కవరేజీని పూర్తిగా నిలిపివేశాయి.ప్రస్తుత పరిస్థితి కారణంగా భారతీయ ఎగుమతులకు ఇతర మార్కెట్ విభాగాల్లో పోటీ లేమి కారణంగా ముందు వ్యాపారం మందగించనుంది. అజయ్ శ్రీ వాస్తవ



గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు హౌతి దాడుల కారణంగా ఈ మార్గాన్ని గేట్ ఆఫ్ టియర్స్ అనగా కన్నీళ్ల ద్వారంలా మారిందని పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా తన ముద్రను నిలుపుకున్న భారత దేశానికి డిమాండ్ మందగించిన పశ్చిమాన 2023లో నెలకొన్న భూగోళ యుద్ధ రాజకీయ పరిస్థితి వల్ల ఇటీవలి కాలంలో విధాన రూపకర్తలకు సవాలుగా మారనుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో దేశం మొత్తం ఎగుమతుల నుండి 30 బిలియన్ల మేర తగ్గుదల అంచనా. రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్ డెవలపింగ్ కాంట్రీస్ ప్రాథమిక అంచనా, ఈ ఆర్థిక సంవత్సరంలో భారతీయ ఎగుమతులు 6.7% తగ్గుదల. దుస్తులు తయారీ అధికంగా జరుగుతున్న భారత దేశం, పాకిస్తాన్ నుండి సరుకులకు కొంత అంతరాయం కలిగిందని యుఎస్ రూటర్స్ టార్గెట్ అనే సంస్థ.ప్రపంచంలోని అతిపెద్ద షిప్-బ్రోకర్ యూనిట్ అయిన క్లార్క్‌సన్ రీసెర్చ్ సర్వీసెస్ లిమిటెడ్ ప్రకారం సూయెజ్ కెనాల్‌ను ఉపయోగించే ఓడల సంఖ్య డిసెంబర్ మొదటి అర్ధభాగంలో సగటు కంటే 44 శాతం తక్కువగా ఉందని జనవరిలో నివేదించింది. జనవరి మొదటి వారానికి 4 మిలియన్ల నుండి 2.5 మిలియన్ల నౌకల స్థల ఎగుమతి తగ్గింది. హౌతి తిరుగుబాటుదారులు డ్రోన్లు, నౌకా వ్యతిరేక క్షిపణులను ఆశ్రయించి, నౌకలను లక్ష్యంగా చేసుకున్నారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఓడ, సిబ్బందిని సీజ్ చేయడానికి వారు హెలికాప్టర్‌ను కూడా ఉపయోగించారు. వారు మొదట్లో ఇజ్రాయెల్‌కు వెళ్లే లేదా ఇజ్రాయెల్ నుండి వెళ్లే ఏదైనా ఓడను లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించినట్లు, వారు ఇప్పుడు నార్వే, లైబీరియా దేశాలకు ఫ్లాగ్ చేయబడిన కంటైనర్ షిప్‌లు, ఆయిల్ ట్యాంకర్‌లతో సహా ఏదైనా ఓడపై దాడి లేదా క్షిపణి కాల్పులు జరుపుతామని బెదిరింపులకు ప్రయత్నిస్తున్నారు. దాడుల పట్ల జాగ్రత్త వహించి,మెరాస్క్ వంటి ప్రధాన షిప్పింగ్ గుడ్ కంటార్‌లు తమ నౌకలను ఆఫ్రికా, కేప్ ఆఫ్ హోప్ చుట్టూ పంపుతున్నాయి. ఇది ఇతర ఖర్చులతో పాటుగా షిప్పింగ్, బీమా, ఇంధనం ఖర్చులను పెంచుతూ ఒక వారం లేదా రెండు వారాల పాటు ప్రయాణాలను పెంచుతుంది. కాగా భారత దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారా ఈ సమస్యకు దౌత్యపరమైన పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తోంది. విదేశాంగ మంత్రి జైశంకర్ ఇటీవల ఇరాన్‌తో చర్చలు జరిపారు. డిఫెన్స్ మంత్రిత్వ శాఖ కూడా సముద్ర గుండా వెళ్లే నౌకలకు నిఘా పెంచాలని నిర్ణయించింది. దీని కోసం కంటైనర్ షిప్పులకు ఎస్కార్ట్ కల్పించింది. ఇలా హౌతి దాడులు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది.

# మాఘమాసం ఎంతో పవిత్రం

తిరుమల,మాఘమాసానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. పుణ్యస్నానాలకు, పుణ్యక్షేత్రాల దర్శనానికి ఈ మాసం ఎంతో పవిత్రమైనది. అలాగే మాఘపౌర్ణమి నదీస్నానాలకు, సముద్ర స్నానాలకు మరీ ప్రత్యేకంగా చెప్పబడింది. ఈ మాసానికి పరిపోషకుడు మాధవుడు. 'మా అంటే మహాలక్ష్మి. 'ధనుడు' అంటే భర్త. మాధవుడు అంటే లక్ష్మీదేవికి భర్త అని అర్థం. అందుకే శ్రీమహాలక్ష్మి కూడా ఈ మాసాన్ని ఎంతగానో ఇష్టపడుతుంది. లక్ష్మీనారాయణులకు ప్రీతికరమైన మాసం కనుక శ్రీవైష్ణవులకు ఈ మాఘమాసం ఎంతో ప్రధానమైనది. విద్యాధిదేవత, వాగ్దేవి, జ్ఞానప్రదాయిని అయిన సరస్వతీదేవి ఈ మాఘమాసంలోనే శుద్ధ పంచమినాడు జన్మించింది. అందుకే మాఘశుద్ధ పంచమిని 'శ్రీపంచమి' అని అంటారు. 'శ్రీ' అంటే లక్ష్మీదేవి అని అర్థం. మానవునకు అవసరమైన ఆరు సంపదలలోను విద్యాసంపద ఒకటి. కనుకనే శ్రీమహాలక్ష్మి 'శ్రీపంచమి'నాడు సరర్వతీదేవి రూపంలో భాసిస్తుంది. ఈ రోజునే తల్లిదండ్రులు తమ పిల్లలకు 'అక్షరభ్యాసం' జరిపిస్తారు. నిజానికి మకర సంక్రమణం జరిగినది మొదలు కుంభసంక్రమణం జరిగేవరకు మధ్య ఉండే మధ్యకాలమే 'మాఘమాసం'. పవిత్రస్నానాలు పౌష్య శుక్ల పూర్ణిమతో మొదలై మాఘశుక్ల పూర్ణిమటో ముగుస్తాయి. చాంద్రమానం అనుసరించేవారికి ఈ మాఘమాసం పౌష్య బహుళ అమావాస్యతో ప్రారంభమై మాఘ బహుళ అమావాస్యతో ముగుస్తుంది. ఈ మాఘమాసం మొత్తం పవిత్రస్నానాలు చేయడం విశేష పూర్వప్రదం. కానీ, ఈ యాంత్రిక జీవితంలో అది సాధ్యం కానీ పని తెలిసే ... కనీసం 'మాఘపూర్ణిమ' నాడైనా నదీస్నానం గానీ, సముద్రస్నానం గానీ చేస్తే మాఘమాసం మొత్తం పవిత్ర స్నానాలు చేసిన ఫలితం వస్తుందని పెద్దలంటారు. ఎందుకంటే మాఘపూర్ణిమను 'మహామాఘి' అని అంటారు. సంవత్సరంలో వచ్చే 12 పూర్ణిమలలోనూ 'మాఘ పూర్ణిమ' అత్యంత విశేషమైనది. ఈ 'మహామాఘి' శివ, కేశవులిద్దరికీ ప్రీతికరమైనది. అందుకే ఈ మాఘ పూర్ణిమ నాడు తప్పకుండా సముద్రస్నానం చేసితీరాలి. శివ, కేశవులిద్దరినీ ఆరాధించి తరించాలి. ఈ మాఘమాసంలోనే ఆరోగ్యప్రదాత అయిన సూర్యుడు సప్తమి తిథినాడు జన్మించాడు. అందుకే మాఘశుద్ధసప్తమి 'రథసప్తమి' పర్వదినం అయింది. లయకారుడైన పరమేశ్వరుడు లింగాకారంలో ఉద్భవించి మాఘ బహుళ చతుర్ధశిని 'శివరాత్రి' పర్వదినం చేశాడు. విష్ణుసహస్రనామ స్తోత్రాన్ని సర్వమానవాళికి అందించిన భీష్మ పితామహుడు ఈ మాఘ శుద్ధ అష్టమినాడు పరమపదం చేరి, మాఘశుద్ధ ఏకాదశి 'భీష్మ ఏకాదశి' పర్వదినం చేశాడు. త్రిమతాచార్యులలో ఒకరైన 'మధ్వాచార్యుడు' ఈ మాఘశుద్ధ నవమినాడు వైకుంఠ ప్రాప్తి పొందాడు. ఉడిపి కృష్ణుని మనం చూడగలుగు తున్నామంటే అందుకు మధ్వాచార్యుని కరుణాకటాక్షమే కారణం. అందుకే మాఘశుద్ధ నవమిని 'మధ్వనవమి'గా పాటిస్తూ ఉడిపి క్షేత్రంలో ఎంతో కోలాహాలంగా కృష్ణునికి విశేషమైన ఉత్సవాలు, వేడుకలు చేస్తారు. జ్యోతిషశాస్త్ర ప్రకారం ఈ మాసాన్ని 'కేతువు' పరిపాలిస్తూంటాడు. కేతువు జ్ఞానప్రదాత, మోక్షకారకుడు. కనుక ఈ మాసంలో కేతువు విశేష పూజలు అందుకుంటాడు. చాంద్రమానం ప్రకారం చంద్రుడు 'మఖ' నక్షత్ర మండలంతో కూడి వుండే మాసం కనుక ఈ మాసానికి 'మాఘమాసం అనే పేరు వచ్చింది. మాఘ అమావాస్య పితృకార్యాచరణకు ఎంతో ప్రధానమైన రోజు. ఆ రోజున పైతృకం చేస్తే పితృదేవతలు పదివేల సంవత్సరాల పాటు స్వర్గసుఖాలు అనుభవిస్తారని పురాణాలు చెబుతున్నాయి. సాధారణంగా గ్రహణకాలాలు, సంక్రమణాలు 'పైతృకాలకు' ఎంతో అనువైన కాలాలుగా భావిస్తారు. అయితే, ఆదివారం, అమావాస్య, శ్రవణనక్షత్రం, వ్యతీపాత యోగం అన్నీ ఒకేరోజున కలిసివస్తే దాన్ని 'అర్ధోదయ పుణ్యకాలం' అంటారు. అది గ్రహణకాలం కన్నా గొప్పదని శాస్త్రాలు చెబుతున్నాయి. పైగా మాఘ అమావాస్య, శతభిష నక్షత్రంలో కూడి వుంటే మరింత విశేషమని ధర్మసింధువు చెబుతుంది. కనుక, ఈ మాఘ అమావాస్య నాడు పితృదేవతలను స్మరిస్తే, పుత్రధర్మాన్ని నిర్వర్తించిన వారిమౌతాం. సకల నదీ, నదాలు చివరకు సముద్రంతోనే సంగమిస్తాయి. కనుక, సముద్రస్నానం చేస్తే సకల నదులలోనూ స్నానం చేసిన పుణ్యఫలం దక్కుతుంది. ముఖ్యంగా సముద్రుడి ప్రత్యేకత ఏమిటంటే ... ప్రతినిత్యం సూర్యకిరణాలవల్ల, ఎంతో నీరు ఆవిరి అవుతున్నా సముద్రం యొక్క పరిమాణం తగ్గదు. అలాగే, ఎన్నో జీవనదులు తనలో కలుస్తున్నా సాగరుని పరిమాణం పెరగదు. స్థిరత్వం ఆయన ధర్మం.సాగరుడు సంతోశప్రదుడు. సంవత్సరంలో నాలుగుసార్లు సాగరస్నానం చేయాలనీ, అవి కూడా 'ఆషాఢ పూర్ణిమ, కార్తీక పూర్ణిమ, మాఘపూర్ణిమ, వైశాఖ పూర్ణిమ'లలో చేయాలని, ఆలా సాగరస్నానాలు చేసినవారికి సముద్రుడు సంపూర్ణ ఆరోగ్యం కలుగజేస్తాడని పురాణాలు చెప్పాయి. 'స్నానం బ్రాహ్మీ ముహూర్తాన్ని నదీస్నానానికి అనుకూల సమయంగా నిర్ణయించారు. సూర్యోదయకాలం నుంచి, సూర్యాస్తమయం వరకూ ప్రసరించే సూర్యకిరణాలలోని విద్యుచ్ఛక్తిని నదీజలాలు, సాగర జలాలు తమలో నిక్షిప్తం చేసుకుంటాయి. తన వెండి వెలుగులతో జగతిని జ్యోత్స్నామాయం చేసే చంద్రుడు తన కిరణాలలోని అమృతత్త్వాన్ని, ఔశదీ విలువలను నదీజలాలకు అనుగ్రహిస్తాడు. నీటిలో వుండే ఈ అద్భుతశక్తులు ... తిరిగి సూర్యకిరణాలకు పరావర్తనం చెంది అంతరించి పోతాయి. అందుకే సూర్యోదయానికి పూర్వమే స్నానం పూర్తి చేయాలనే నియమాన్ని విధించారు. మాఘమాసం మొత్తం పవిత్రస్నానాలు చేయడానికి వీలు కుదరకపోతే, మాఘమాసం చివరి మూడురోజులైనా పవిత్రస్నానాలు చేస్తే మంచి ఫలాన్ని పొందవచ్చు. చివర మూడుస్నానాలనూ 'అంత్యపుష్కరిణీ స్నానాలు' అంటారు. సాధారణ స్నానం శరీర మలినాన్ని పోగొడితే, మాఘమాసం, మనసులోని మాలిన్యాన్ని పోగొట్టి మాధవుని సన్నిధికి చేరుస్తుంది.

# ఏపీలో థర్డ్ ఫ్రంట్.. వేగంగా పడుతున్న అడుగులు

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ లో సార్వత్రిక ఎన్నికల సమరానికి సమయం దగ్గర పడుతున్న తరుణంలో %ా% ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యూహాలను రచిస్తున్నాయి. అధికార వైసీపీని గద్దె దించడమే లక్ష్యంగా ఇప్పటికే టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయి.

ఇందులో బీజేపీ కూడా చేరేందుకు సిద్ధమవుతోంది. మరో రెండు, మూడు రోజుల్లో కూటమిలో చేరడంపై స్పష్టత రానుంది. ఆ తరువాత సీట్లను మూడు పార్టీలు పంచుకోనున్నాయి. ఇప్పటికే ఒక కూటమి ఏర్పాటు కాగా.. మరో కూటమి ఏర్పాటునకు రాష్ట్రంలో చాప కింద నీరులా ప్రయత్నాలు సాగుతున్నాయి. దేశంలో ప్రధాని మోదీని గద్దె దించేందుకు ఇండియా పేరుతో కూటమిగా ఏర్పడ్డ పార్టీలు.. ఇక్కడ మరో కూటమికి ప్రయత్నిస్తున్నట్టు చెబుతున్నారు. రాష్ట్రంలో ఏర్పాటు కాబోయే మరో కూటమికి కాంగ్రెస్ పార్టీ సారథ్యం వహించనున్నట్టు చెబుతున్నారు.ఇందులో సీపీఐ, సీపీఎంతోపాటు సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ఏర్పాటు చేసిన జై భారత్ నేషనల్ పార్టీ కూడా ఇందులో చేరబోతున్నట్టు చెబుతున్నారు. దీనికి సంబంధించిన గ్రౌండ్ ప్రిపేర్ చేసే పనిలో కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలు పని చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

షర్మిల రాకతో కాంగ్రెస్‌లో జోష్

కాంగ్రెస్ పార్టీలో షర్మిల చేరిన తరువాత జోష్ పెరిగింది. షర్మిల పార్టీలో చేరకముందు నిస్తేజంలో కూరుకుపోయిన కేడర్ ఒక్కసారిగా యాక్టివ్ అయింది. అధికార, ప్రతిపక్షాలపై తనదైన శైలిలో షర్మిల పదునైన విమర్శనాస్త్రాలు సంధిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. ఏళ్ల తరబడి కాంగ్రెస్ పార్టీ వాదులుగా ఉన్న ఎంతో మంది మళ్లీ షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీ వైపు వచ్చేందుకు సిద్ధపడుతున్నారు. గడిచిన ఎన్నికల్లో రెండు శాతం కంటే తక్కువ ఓట్లను సాధించిన కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో మెరుగైన ఓటు బ్యాంకును సాధించేందుకు అవకాశముందని పార్టీ విశ్లేషకులు చెబుతున్నారు. వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు పూర్తిస్థాయిలో అభ్యర్థులను ప్రకటించిన తరువాత.. సీట్లు రాని ఎంతో మంది నేతలు కాంగ్రెస్‌లో చేరతారని అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగానే అసంతృప్త నేతలకు తలుపులు తెరిచే కాంగ్రెస్ పార్టీ ఉంచింది. ఇది కూడా పార్టీకి అడ్వాంటేజ్‌గా మారుతుందని పలువురు చెబుతున్నారు.

# మేనిఫెస్టోపై వైసీపీ కసరత్తు..



అమరావతి,త్వరలోనే సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రానుంది. ప్రధాన పార్టీలన్నీ మేనిఫెస్టోలపై దృష్టి పెట్టాయి. ఏపీలో ఇప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ.. తన అధికారాన్ని నిలబెట్టుకునేందుకు కసరత్తు చేస్తోంది. మరో వారం రోజుల్లో మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. ఇందులో భాగంగా ప్రచారంతో పాటు మేనిఫెస్టో రూపకల్పనపై ఫోకస్ పెట్టారు జగన్. 2019 ఎన్నికల్లో నవరత్నాలు పేరుతో వైసీపీ అధినేత జనగ్మోహన్ రెడ్డి మేనిఫెస్టోను ప్రకటించారు. 26 అంశాలతో మేనిఫెస్టోను తీర్చిదిద్దింది.. కేవలం నాలుగు పేజీల్లో కుదించిన మేనిఫెస్టోను విడుదల చేశారు. అయితే నాటి మేనిఫెస్టోలో ప్రకటించిన నవరత్నాలే వైసీపీని విజయతీరాలకు చేర్చాయి. ఆ పథకాలు ఆకట్టుకోవడంతో.. జనాలను వైసీసీకే పట్టం కట్టారు. మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు అమలు చేసేందుకు వందకు వంద శాతం కృషి చేశామని.. ఇచ్చిన హామీ ప్రకారం నవరత్నాలు అమలు చేశామని చెబుతున్నారు జగన్.ఇప్పుడు ఎన్నికల ముంగిట మరోసారి జనాలను ఆకట్టుకునేందుకు కసరత్తు చేస్తున్నారు వైసీపీ అధినేత జగన్. ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలతో పాటు మరికొన్ని హామీలతో మేనిఫెస్టో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కొద్ది రోజులుగా తీవ్ర కసరత్తు చేస్తున్న జగన్.. ఈ సారి నవరత్నాలకు మించిన హామీలతో మేనిఫెస్టో సిద్ధం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం మేనిఫెస్టోపై జగన్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. రైతులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు, నిరుద్యోగులు, యువత, విద్యార్థులు ఇలా అన్ని రంగాల వారిని ఆకట్టుకునేలా మేనిఫెస్టోను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే పెన్షన్ 3 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన జగన్.. ఇచ్చిన మాట ప్రకారం హామీ అమలు చేశారు. ఇప్పుడు మరోసారి అధికారంలోకి వస్తే పెన్షన్‌ను 4 వేలకు పెంచుతామని హామీ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. ఏపీలో పెన్షన్ పొందేవారి సంఖ్య లక్షల్లో ఉంది. ఈ హామీ ద్వారా వారంతా తమకు వైపు మళ్లుతారని భావిస్తున్నారు జగన్. మరో వైపు ఏపీలో దాదాపు 70 లక్షల మంది రైతులు ఉన్నారు. వారందరినీ ఆకట్టుకునేలా రైతులకు కీలక హామీ ఇవ్వబోతున్నారని.. రుణ మాఫీ చేస్తామనే హామీలతో ప్రజల్లోకి వెళ్లబోతున్నట్లు తెలుస్తుంది. అదేవిధంగా మహిళా సంక్షేమానికి మరింత కృషి చేస్తామని.. డ్వాక్రా మహిళల కోసం కొత్త పథకాలు తీసుకొస్తామని మేనిఫెస్టోలో హామీల వర్షం కురిపించనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా యువత, నిరుద్యోగులను ఆకట్టుకునేందుకు జగన్ ప్రత్యేక హామీలు సిద్ధం చేసినట్లు చెబుతున్నారు వైసీపీ నేతలు. ఈ సారి ఎన్నికల్లో రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా దూసుకెళ్తున్న వైసీపీకి.. ప్రస్తుతం కసరత్తు చేస్తున్న మేనిఫెస్టో బ్రహ్మాస్త్రంగా పనిచేస్తుందంటున్నారు వైసీపీ పెద్దలు. ఇప్పటికే ఉత్తరాంధ్ర నుంచి వైసీపీ ఎన్నికల శంఖారావం పూరించింది. భీమిలిలో తొలి ఎన్నికల శంఖారావ సభను నిర్వహించిన అధికార పార్టీ.. రాష్ట్ర వ్యాప్తంగా సభలకు సిద్ధమవుతోంది. మరి వైసీపీ మేనిఫెస్టో జనాల్లోకి ఎంతు వరకు వెళ్తుంది.. మేనిఫెస్టోలో ప్రకటించే హామీలు ఎంత వరకు ప్రజలను ఆకట్టుకోగవు.. బ్రహ్మాస్త్రంగా భావిస్తున్న ఈ మేనిఫెస్టో.. రెండోసారి వైసీపీకి జనం పట్టం కడుతారా.. లేదా అనేది వేచి చూడాలి.

# చంద్రబాబుకు పావుగా షర్మిల...

తిరుమల: నాలుగున్నరేళ్లు తెలంగాణ బిడ్డను అని చెప్పుకొని ఇప్పుడు ఏపీ గురించి షర్మిల హడావుడి చేస్తున్నారని సీరియస్ అయ్యారు మంత్రి రోజా.. తిరుమల శ్రీవారిని ఆమె నేడు దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..'టీడీపీ నేత చంద్రబాబు నాయుడు 1998, 2008, 2018లో ఇవ్వాల్సిన డీఎస్సీలను సీఎం జగన్ ఇచ్చి 17వేల పోస్టులను భర్తీ చేశారన్నారు. 6,100 భర్తీలకు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేశారని వివరించారు..రాజకీయ అనుభవం లేని వైఎస్ షర్మిల రెండు పార్టీల మధ్య పావుగా మారి, జగనన్నపై విషం చిమ్ముతోందని ధ్వజమెత్తారు.నాలుగున్నర ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ లో లేకుండా, తెలంగాణకు వెళ్లి మీ బిడ్డను, అండగా ఉంటానని చెప్పిన షర్మిల ఈరోజు జగనన్నపై ఆరోపణలు చేస్తున్నదంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. షర్మిలకు రాజకీయ అవగాహన లేదని అంటూ, నిన్న ఆమె చేసిన హడావిడి చూస్తేనే అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. షర్మిల ఆరాటాలు, పోరాటాలు చూస్తే ప్రజలకు ఇప్పటికే విషయం అర్థం అయిపోయిందన్నారు. ఇదంతా కేవలం చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ పార్టీ కలిసి ఆడుతున్న నాటకం అన్నారు. ఇందులో షర్మిలను పావుగా వాడుకుంటున్నారన్నది అందరికీ అర్థమవుతోందని స్పష్టం చేశారు. ఆస్తుల పంపకాల విషయంలో చంద్రబాబు ఎంత మంచోడో, వాళ్ళ అన్నా, తమ్ముడు, అక్క, చెల్లెలు, భార్యకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్ కుటుంబంలో ఆస్తుల పంపకాల విషయంలో ఏదో పిచ్చి మాటలు తప్ప మరోటి లేదన్నారు. దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి తన బిడ్డలు జగనన్నకు షర్మిలకు పేరు ప్రఖ్యాతలతో పాటు ఆస్తులను కూడా ఎప్పుడో రాసి, పంచిచ్చేశారని

# విభజన హామీలు గాలికొదిలిన జగన్



అమరావతి,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అమలు పరచడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సానుభూతి ప్రకటిస్తున్నారా లేక..కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తున్నారా అన్నది అర్థం కావడం లేదు. అయితే గత పదేళ్లుగా మోడీ మాత్రం ఇంచు మాత్రం సాయం కూడా చేయకుండా కాలం గడపడంలో విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన తీరు గురించి, కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి గురించి మోదీ తరచూ విమర్శలు చేస్తూనే ఉన్నారు. అయితే కాంగ్రెస్ చేసిన ఆ తప్పును సరిచేసేందుకు గత పదేళ్ళలోనూ దేశ ప్రధానిగా, సభానాయకుడిగా తాను ఎందుకు ప్రయత్నం చేయలేదో మోదీ ఎప్పుడూ చెప్పలేదు. ఈ క్రమంలో ఎపిలో బిజెపిని ఆదరించాలని కోరుకుంటున్నారు. కొన్ని సీట్లను సాధిస్తే రాజకీయాలు తమ గుప్పిట్లో ఉ ంటాన్న ప్రయత్నాల్లో ఉన్నారు. ఎన్‌డిఎలోకి టిడిపి చేరితే కొంత పరిస్థితి మెరుగు పడగలదన్న ఆలోచనలో స్థానిక నేతలు కూడా ఉన్నారు. టిడిపి, జనసేనలతో కలసి వెళితే ఓ ఐదారు అసెంబ్లీ సీట్లు కొట్టేయవచ్చని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని ద్వేషించాలంటే, విభజన సమస్యలను పరిష్కరించకుండా సజీవంగా ఉంచడం ముఖ్యమని, తద్వారానే తన రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవచ్చునని బీజేపీ భావిస్తుందన్న భావన కూడా వ్యాప్తిలో ఉంది. అందుకే విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితికి ఊతమిస్తుందనుకొన్న పోలవరం, ప్రత్యేక హోదా అమలు విషయంలో ప్రత్యేక ప్యాకేజి నాటకానికి తెరతీసింది. విభజనపై జరిగిన అన్యాయాలపై సుప్రీంలో పిటిషన్ వేసి కొట్లాడాలని, పార్లమెంటులో చర్చ చేయాలని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ పదేపదే కోరుతున్నా ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. ఉండవల్లి మాటలను ఎవరూ ఖాతరు చేయడం లేదు. కనీసం ఆయనతో చర్చించడానికి కూడా ఎవరు ముందుకు రావడం లేదు. ఎపి ఆర్థికస్థితి దివాళా తీయడానికి జగన్ పాలాన తీరు కూడా కొంత కారణంగా చూడాలి. డబ్బుల పందేరంతో ఖజానాను దెబ్బతీసారు. అనవసర పథకాలతో డబ్బును ఊడ్చేశారు. మరోవైపు సాయం చేయాల్సిన బిజెపి నేతలు ఆర్థిక దివాళా గురించి పదేపదే ఎద్దేవా చేస్తున్నారు. అమరావతి లక్ష్యం వెనక్కి పోయింది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభజన సమస్యలు రావణకాష్ఠంలా మండుతూనే ఉన్నాయి. ఇదే సమయంలో తన రాజకీయ ప్రయోజనాలను బీజేపీ ఉపయోగించుకుంటోంది. ఇకపోతే అధికార, ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. అలాగే పరస్పర నిందారోపణలతో కాలం గడపటం వల్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ఉమ్మడిగా పోరాడాలన్న రాజకీయ స్ఫూర్తి లేకపోవడంతో పదేళ్లు గడిచినా కేంద్రం నుంచి సాధించేది ఏమీ లేదని నిరూపించారు. విభజన తర్వాత ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పుల పంపకాలకు సంబంధించిన సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి సైతం మోదీ సర్కార్ కృషి చేయలేదు. కొన్ని ఆస్తుల పంపకం విషయంలో వాటాలు కుదరక ఇరు రాష్ట్రాలు వివిధ న్యాయస్థానాలను ఆశ్రయించినా కేంద్రం ప్రేక్షకపాత్ర మాత్రమే వహించింది. త్రిసభ్య కమిటీ కూడా ఎలాంటి పురోగతి చూపలేకపోయింది. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు పార్లమెంటులో ఇచ్చిన హామీలలో ఒక్కదాన్ని కూడా మోదీ ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేదు. ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, కడప ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ రైల్వే జోన్, దుగ్గరాజపట్నం పోర్టు, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్, నిధుల లోటు భర్తీ, వెనుకబడిన జిల్లాలకు, ప్రాంతాలకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి... ఇలా ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ఉన్నత విద్యాసంస్థలను మాత్రం ప్రారంభించి, వాటిలో మౌలిక సదుపాయాల కోసం నిధులను విడతల వారీగా విడుదల చేస్తోంది. మిగతా హామీల అమలుకు పార్లమెంటు సాక్షిగా వాటి అమలుకు మాకు పది సంవత్సరాలు సమయం ఉందని సమాధానం చెప్పి తప్పించుకున్నది. జాతీయ ప్రాజెక్టులకు అందే ప్రయోజనాలు కూడా పోలవరం విషయంలో అందడం లేదు. విభజన వల్ల, రాజధాని కోల్పోవడం వల్ల నష్టపోతున్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టడానికి ప్రత్యేక హోదా ఇవ్వడమే పరిష్కారమని పార్లమెంటు ఉభయ సభలలో అధికార, ప్రతిపక్ష సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అధికార కాంగ్రెస్ ఐదేళ్లు మాత్రమే హోదా ఇస్తామంటే ప్రతిపక్ష బీజేపీ పదేళ్లు ఇవ్వాలని పట్టుపట్టింది. చివరకు ప్రకటించిన విధంగా ఐదేళ్ల ప్రత్యేక హోదా కూడా ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్‌ను మోదీ ప్రభుత్వం వంచించింది. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయడానికి ప్రత్యేక హోదా ఇస్తే కేంద్ర ప్రాయోజిత పథకాలలో అదనంగా వచ్చే 30శాతం నిధులు ప్రత్యేకంగా ఇస్తామని ప్యాకేజీ క్రింద ప్రకటించింది. ఆంధప్రదేశ్‌లో పార్లమెంటు సభ్యులు- అధికారం, ప్రతిపక్షం రెండుగా చీలిపోయి ప్రత్యేక హోదా రాకపోవడానికి కారణం మీరంటే మీరంటూ నిందించుకొంటూ, అసలు కారణం అయిన మోదీని, బీజేపీ ప్రభుత్వాన్ని మాత్రం ఉమ్మడిగా నిలదీయలేకపోయారు. దీంతో నష్టపోతున్నది మన రాష్ట్రమే అని వారు గుర్తించకపోవడంతో మోడీకి కలసి వస్తోంది. అలాగే పోటీపడి మోడీ ప్రాపకం కోసం ఇప్పుడు నేతలు సాగిలపడుతున్నారు.

## ప్రజా సంక్షేమాన్ని వీడి ప్రైవేట్ సేవలో ప్రభుత్వాలు

న్యూఢిల్లీ,కార్పొరేట్ల కొమ్ము కాస్తే అది ప్రజలకు భారంగానే మారుతుంది. రోడ్లు వేయటం, ప్రాజెక్టులు కట్టడం, పరిశ్రమలు స్థాపించడం, రైల్వే, ఎల్ఐసి, పోస్టల్, టెలికం రంగాల నిర్వహణ అన్నీ భారంగానే మారతాయి. అందుకే ప్రభుత్వాలు కార్పొరేట్లకు లాభం చేకూర్చే వైపు కాకుండా ప్రజల సంక్షేమం వైపు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. కార్పొరేట్లకు చేసే మేలు వల్ల సామాజిక బాధ్యత గురించి, సామాజిక అంశాల గురించి, ఆ మాటకొస్తే మానవత్వం గురించి మాట్లాడలేరు. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు, ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు, ప్రభుత్వ రంగంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రభుత్వమే అమలు చేసింది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని చూడాలి. ప్రజల కష్టాల్ని, భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వ ధనాన్ని వెచ్చించాలి. పన్నుల భారం నుండి, అధిక ధరల నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ప్రజలకి ప్రభుత్వానికి వారధిగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యా యులకు రాజ్యాంగబద్ధంగా ఇచ్చిన హక్కుల్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ప్రజల్లో ఏదైనా అంశం మీద అసంతృప్తి ఏర్పడితే దాన్ని చర్చల ద్వారా తగ్గించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. చర్చించడం అన్న విధానాన్ని నిరంతరాయంగా ప్రజలముందుకు తీసుకుని రావాలి. ప్రజల పక్షాన నిలబడటం ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత. దీనికి భిన్నంగా కార్పొరేట్లకు, మార్కెట్ శక్తులకు లాభాన్ని చేకూర్చే విధానాన్ని అమలు చేస్తున్న కారణంగా, పాలకుల తప్పులకు బాధ్యులు ఎవరన్నది చెప్పాలి. 1980 తరువాత భారతదేశంలో ఆర్థికమాంద్యం ఏర్పడింది. విదేశీ మారక నిల్వలు కరిగిపోవడం, బంగారాన్ని సైతం కుదువ పెట్టాల్సి రావడం, అప్పుల కోసం ప్రపంచ దేశాల మీద ఆధార పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో భారతదేశం అప్పు కోసం ప్రపంచ బ్యాంకు తలుపు తట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచ బ్యాంక్ షరతులకు లోబడి తెచ్చుకున్న అప్పు ఫలితంగా ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వ నుంచి పక్కకు తప్పుకోవాల్సి వచ్చింది. ప్రజలకు కావలసిన ప్రతి అవసరానికి సరుకుగా చూడడం మొదలు పెట్టింది. 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన నాటి నుంచి నేటి వరకు 32 సంవత్సరాల కాలంలో ప్రతిదీ సరుకుగా మారిపోయింది. ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్‌గా మారిపోయింది. ఆఖరికి ప్రభుత్వ రంగ కంపెనీలను అమ్మడం కోసం, కార్పొరేట్లకు అప్పచెప్పటం కోసం కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేసిందంటే పరిస్థితుల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం వల్ల కార్పొరేట్లకు అవసరమైన పెట్టుబడుల వెతుకులాటలో వుండగా.... భారతదేశ ప్రభుత్వరంగ పరిశ్రమలతో పాటు ప్రభుత్వం దగ్గర ఉన్న వివిధ రకాల నిల్వలు, పెన్షన్ ఫండు నిల్వల మీద ప్రపంచ బ్యాంక్ కన్ను పడింది. పరిశ్రమలతో పాటు ఈ దేశంలో ఉన్న సహజ సంపదల మీద కూడా ప్రపంచ బ్యాంకు చూపు పడింది. అప్పుకెళ్లిన ప్రతిసారీ సంస్కరణ పేరుతో ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుని ప్రైవేటు రంగానికి కేటాయింపులు చేసేలా ఒత్తిడి తెచ్చింది. దాని ఫలితంగానే నేడు మనకు సర్వదరిద్రాలు వచ్చాయి. దీనిలో భాగంగానే ప్రజలకిచ్చే సబ్సిడీలపై కోతను విధిస్తోంది. ధరలు పెంచు తోంది. రైతాంగ వ్యతిరేక చట్టాలు తెస్తోంది. కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్స్‌గా మార్చేసింది. భూమి, గనులు, రైల్వేలు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, గాలి, నీరు, పాలు... ఒక్కటేమిటి ఇప్పటి వరకు సహజ సంపదలుగా, ప్రభుత్వరంగ సంస్థలుగా ఉ న్న అన్నీ... ప్రైవేటు సేవలుగా మారుతున్నాయి. అన్ని రంగాల నుంచి ప్రభుత్వం తప్పుకొని, కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెబుతోంది. దీనివల్ల భవిష్యత్తు లో యూజర్ చార్జీల పేరుతో వందలాది రూపాయలు వసూలు చేసే పని జరుగుతున్నది. ఎంటర్‌టైన్ మెంట్‌కు కూడా రుసుము చెల్లించాల్సిన పరిస్థితి. ప్రతిదాన్నీ ప్రభుత్వం సరుకుగా మార్చివేస్తున్నది.

## మేడారంపై వివక్ష చూపడం సరికాదు..

ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ జాతరగా పేరుగాంచిన మేడారం అత్యంత ఉత్సాహ భరిత వాతావరణంలో కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై సమ్మక్క సారలమ్మను దర్శనం చేసుకున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడారానికి వెళ్లిన సీఎం జాతర పరిసరాలను పరిశీలించారు. మేడారంలో వనదేవతకు పూజలు చేసి అమ్మవార్లకు సాంప్రదాయపద్ధతిలో నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మేడారం సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వన దేవతలను కోరుకున్నాన్నారు. ములుగు జిల్లాతో, మంత్రి సీతక్కతో తనకు ప్రత్యేక అనుసంబంధం ఉందన్నారు. ఎన్నికల సందర్భంలో ముఖ్యమైన కార్యక్రమాలన్నీ నేను ఇక్కడి నుంచే ప్రారంభించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించామన్నారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా రూ.110 కోట్లు మంజూరు చేశామని సీఎం అన్నారు. పాలకులు ప్రజలను పీడించినప్పుడు ఎవరో ఒకరు నిలబడతారన్నారు. సమ్మక్క, సారలమ్మ నుంచి స్ఫూర్తి పొంది గత ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేశామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మరో రెండింటిని అమలు చేసేందుకు ముహూర్తం ఖరారైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ గ్యారంటీలను ఫిబ్రవరి 27న ప్రారంభిస్తామన్నారు. ఈ పథకాల ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకా గాంధీ హాజరవుతారని సీఎం తెలిపారు. మేడారం జాతరపై కేంద్రం వివక్ష చూపడం సరికాదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జాతీయ పండుగగా ప్రకటించడం సాధ్యం కాదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పినట్లుగా పత్రికల్లో చూశానన్నారు.. కేంద్రం కుంభమేళాను జాతీయ పండుగగా నిర్వహిస్తోందన్నారు. దాని కోసం రూ.వందల కోట్లు విడుదల చేసిందన్నారు. దక్షిణాది కుంభమేళా మేడారం జాతరకు మాత్రం కేవలం రూ.3 కోట్లు కేటాయించిందని సీఎం మండిపడ్డారు. తెలంగాణను కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందనేందుకు ఈ జాతర పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరే నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మేడారం జాతరకు ప్రధాని మోదీ, అమిత్ షాను ఆహ్వానిస్తున్నామన్నారు. జాతరకు వచ్చి మోదీ, అమిత్ షా సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలన్నారు. అయోధ్యలో రాముడిని దర్శించుకోవాలని మోదీ, అమిత్ షా చెప్పారన్నారు. ఆ మాదిరిగానే మేడారం జాతరను వారిద్దరూ వచ్చి దర్శించుకోవాలని సీఎం అన్నారు. వారిని అధికారిక హోదాలో స్వాగతం పలికే బాధ్యతను తనతో పాటు గా మంత్రివర్గం చూసుకుంటామని తెలిపారు. మేడారానికి జాతీయ హోదా ఇవ్వలేమంటూ కిషన్ రెడ్డి ఆదివాసీలను అవమానించవద్దని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత సీఎం కేసీఆర్ మేడారం సందర్శించుకోకపోవడం వల్ల భారీ మూల్యం చెల్లించుకున్నారన్నారు. భవిష్యత్తులో బీజేపీకి కూడా అదే పరిస్థితి వస్తుందని కిషన్ రెడ్డికి చెబుతున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం ఉత్తర భారతం, దక్షిణ భారతం అంటూ వివక్ష చూపడం మంచిది కాదన్నారు. దక్షిణ భారత్‌లోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా మేడారం జాతరకు గుర్తింపు ఉందన్నారు. సీఎం వెంట మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి, శ్రీనివాసరెడ్డి, కొండా సురేష్, సీఎస్ శాంతికుమారిలు ఉన్నారు.

## ఆదివాసీల సాంస్కృతిక విప్లవం...



మేడారం.. ఈ పేరు వింటేనే ఆదివాసీలు తప్పకుండా గుర్తుకు వస్తారు. ఎందుకంటే ప్రకృతిని నమ్ముకొని అడవి.. ఆ అడవి సంపదపైన సంపూర్ణ హక్కుదారులం తామేనంటూ ఆదివాసీ గిరిజనులు చెబుతున్నారు. దీనికి కారణం కాకతీయులతో యుద్ధం చేసి ఆత్మార్పణ గాయించిన సమ్మక్క, సారలమ్మ చరిత్ర త్యాగనీయమైనది మరి. మేడారంలోని ఆదివాసీలు, గిరిజనుల దేవతలు సమస్త సబ్బండ జనానికి ఆరాధ్యులైన తీరు మహోన్నతమైనది. ఈ మేడారం జాతర పూర్తిగా ప్రకృతి పండుగ. ఈ మేడారం పండుగ పూజా పద్ధతులు అదే స్థాయిలో ఉంటాయి. మేడారం అంటే అందరికీ తెలిసినదే అయినా తెలుసుకోవాల్సిన ప్రకృతి సిద్ధమైన వంటకాల వివరాలు తెలుసుకుందామా. ముందుగా చెప్పుకోవాల్సింది భూమి దేవర పండుగ. ఈ భూమి దేవరగా భావించి కొన్ని విత్తనాలను ఇంటికి తెచ్చుకునే సామూహిక పండుగ చేస్తారు. మేడారంలోని ఈ పండుగ సమ్మక్క చుట్టే తిరుగుతుంది.పండుగ చేసే ముందు విత్తనాలు సమ్మక్క దగ్గర పెట్టి ఆ విత్తనాలు వేస్తారు. పొట్టకు వచ్చిన ఆ వరిని సమ్మక్క దగ్గర పెట్టి సామూహికంగా ఊరికి ఒకరు చొప్పున వచ్చి వేలుపయ్య (ఆవు) కోసం సమ్మక్కను పూజిస్తారు. ఇది చాలా పెద్ద పండుగ. దీన్నే ఎన్నగట్టు పండుగ అంటారు. మరోటి చిక్కుడు కాయ పండుగ. కొత్తగా వచ్చిన చిక్కుడ కాయను వండి సమ్మక్క దగ్గర పెట్టి అందరూ కలిసి సామూహికంగా భోజనం చేస్తారు. ఇక చెప్పుకోవాల్సింది మరోటి ఏంటంటే.. పచ్చుల పండుగ. కొత్తగా వచ్చిన ఆకుకూరలను వండి సమ్మక్కకు పెట్టి మొక్కిన తరువాతే తింటారు. ఇలా ప్రతి పంటను ప్రతీది అమ్మవారు సమ్మక్క దగ్గర పెట్టి ఆమె అనుమతి పొందాకే తింటారు. ఇక ఇంకోటి ఏంటంటే కొత్తల పండుగ. దీనినే పెద్దల పండుగ అని కూడా అంటారు. ఈ రోజున సమ్మక్కకు కోడిని కోసి తర్వాత మిగిలిన కార్యక్రమాలు చేపడతారు. సమ్మక్కను గద్దె తెచ్చే ముందు దడికట్టి అమ్మ వారికి అలంకరణ చేసి సాంప్రదాయ గిరిజన వాయిద్యాలైన డోలు కొమ్ము నృత్యాలతో అమ్మ వారిని గద్దె దగ్గరకు తీసుకొని వస్తారు. ఈ సందర్భంగా సమ్మక్కకు గొర్రెను కోసి రాత్రంతా ఆటపాటలతో సమ్మక్క గద్దెల వద్ద సంబరాలు చేసుకుంటారు. అమ్మ సమ్మక్క గద్దెల వద్దకు వచ్చే ముందు ఆర్భాటం ఉండటం షరా మామూలే. పూర్తిగా గిరిజన పద్ధతిలో గిరిజనపూజారులు తెల్లబట్టలు ధరించి, ఎర్రరుమాలు చుట్టి మాఘ శుద్ధ పౌర్ణమి నాడు అమ్మవారు సమ్మక్కకు మొక్కులు చెల్లిస్తారు. జంపన్న వాగులో సామూహిక స్నానాలు ఇక్కడికి వచ్చే ప్రతి భక్తుడు ఉంటారు. ఆ మాటకు వస్తే.. మేడారం జాతరకు గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే ఎడ్ల బండ్లు, పట్టణాల నుండి వచ్చే కార్లు ఇతర వాహనాలు ఆ జంపన్న వాగును దాటవలసిందే. అలా లక్షలాది సంఖ్యలో భక్తులు వచ్చే ఈ వారం.. పది రోజులూ భక్తి పారవశ్యంలో మునిగితేలే పండుగనే మేడారం సమ్మక్క సారలమ్మ పండుగ. కాగా సమ్మక్క జాతర గతంలో కేవలం పూర్తిగా గిరిజన జాతరగా ఉండేది. కానీ ఈ మేదరం జాతర క్రమేపీ సబ్బండ వర్గాలకు గిరిజన దేవతలు ఆరాధ్యులైనారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ మేడారం పండుగ అంత ప్రాచుర్యం పొందలేదు. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చాక తెలంగాణ పండుగలన్నింటికీ ప్రత్యేకతలు వచ్చాయి. ఆ నేడు సమ్మక్క సారలమ్మ జాతర చరిత్ర విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. దీనితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తున్నాయి.అటు తమ కొంగు బంగారం అయిన సమ్మక్క సారలమ్మలకు బంగారం (బెల్లం) నిలువెత్తుగా ఇచ్చి తమ భక్తిని చాటుకుంటున్నారు. పిల్లలపెద్దలే కాదు.. మంత్రులు.. ఎంఎల్ఎలు నిలువెత్తు బంగారం సమర్పించుకుంటున్నారు.రెండేళ్లకోసారి వచ్చే ఈ మేడారం మహా జాతరకు ఇసుక వేస్తే రాలనంత జనం వస్తున్నారు. ముందుగా జంపన్న వాగులో సామూహిక స్నానాలు ఆచరించి కల్లు సారలతో.. సాకలు పోసి కోడి పందేల తరహా కోళ్ళు యాటలతో మొక్కులు వారం రోజుల పాటు తీర్చుకుంటూ సమ్మక్క సారలమ్మ తల్లిని కొలుస్తుంటారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం కాలుష్య నియంత్రణ మండలి, ఇతర సాంస్కృతిక శాఖలు మేడారం జాతర వైభవాన్ని వివరిస్తూ పలు సాంస్కృతిక సంబరాలను నిర్వహిస్తున్నాయి. మేడారంలో ఇక్కడ దేవుడికి భక్తులకు మధ్య పూజ చేస్తే ఆశ్చర్యం వేయకమానదు మరి. అదే ఇక్కడి ప్రకృతి ఆరాధ్యులైన వనదేవతల జాతర. ఈ జాతరను మనం అంతా కూడా ప్రతి ఒక్కరం కులమతాలకు అతీతంగా ప్రకృతితో మమేకమై జరుపుకుందాం. అడవిని, అడవి తల్లిని, ఆదివాసీల సాంప్రదాయాలను కాపాడుకుందాం.

## లాస్యనందిత మృతితో బిఆర్ఎస్ షాక్

హైదరాబాద్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతితో బిఆర్ఎస్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఓ యువ ఎమ్మెల్యే మృతితో నేతలంతా షాక్‌కు గురయ్యారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత భౌతిక కాయానికి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులు అర్పించారు. కార్ఖానాలోని లాస్య నందిత నివాసానికి చేరుకున్న ఆయన ఆమె భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం లాస్య నందిత మాతృమూర్తి, మాజీ ఎమ్మెల్యే సాయన్న సతీమణిని, ఇతర కుటుంబసభ్యులను కేసీఆర్ పరామర్శించారు. అంతకుముందు లాస్య నందిత మరణవార్త తెలియగానే కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తంచేశారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత అకాల మరణం చెందడం ఎంతో బాధాకరమన్నారు. అతిపిన్న వయస్సులో ఎమ్మెల్యేగా నందిత ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. కష్టకాలంలో వారి కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లాస్యనందితపార్థివదేహాని బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. కార్ఖానాలో నివాసానికి వెళ్లిన ఎమ్మెల్సీ కవిత, ఎంపీ కేకే, మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, హరీశ్ రావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దారం నాగేందర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కార్పొరేటర్ విజయా రెడ్డితోపాటు పలువురు నాయకులు ఆమె భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే లాస్య నందిత ప్రయాణిస్తున్న కారు పటాన్‌చెరూ సమీపంలో ఓఆర్ఆర్‌పై అదుపుతప్పి రెయిలింగ్‌కు ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు.

## హిందూత్వ ప్రాతిపదికన జనాభా విధానం!

న్యూఢిల్లీ,హిందూత్వ ప్రాతిపదికన జనాభా విధానం!వేగంగా జనాభా పెరగడం వల్ల ఎదురయ్యే సవాళ్ళను, జనాభా మార్పులను అధ్యయనం చేసేందుకు ఉ న్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ఇటువంటి కమిటీ గురించి బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించడం ఇక్కడ ఆసక్తి రేకెత్తించే అంశం. జనాభా పెరుగుదలపై అధ్యయనం చేసేందుకు కమిటీని ఏర్పాటు చేసి దాని ఆధారంగా కొత్త జనాభా విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వం భావించినట్లైతే, దాని గురించి ప్రస్తావన పార్లమెంట్‌ను ఉద్దేశించి రాష్ట్రపతి చేసే ప్రసంగంలో వుండాలి.'వేగంగా జనాభా పెరుగుదల' అన్న అంశమే వివాదాస్పదంగా వున్నందున ఇక ఉన్నత స్థాయి కమిటీ ప్రయోజనం కూడా అస్పష్టంగా వుంది. పైగా, జనగణన నిర్వహించనిదే, కమిటీ పరిశీలించడానికి అవసరమైన డేటా ఎక్కడ నుండి వస్తుంది?జనాభా నియంత్రణ, విధాన రూపకల్పనకు సంబంధించి ఇటువంటి చర్య తీసుకోవడానికిగల నేపథ్యాన్ని ఇక్కడ పరిశీలించాల్సి వుంది. 2022 అక్టోబరులో విజయదశమి నాడు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగిస్తూ, జనాభా నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇది అందరికీ సమానంగా వర్తింపచేయాలని కూడా కోరారు. 'మతం ప్రాతిపదికన జనాభా అసమానతల' ముప్పుల గురించి ఆయన హెచ్చరించారు. దీనివల్ల తూర్పు తైమూర్, దక్షిణ సూడాన్, కొసావోల్లో జరిగినట్లుగా కొత్త దేశాల ఏర్పాటుకు దారి తీసే అవకాశం వుందన్నారు. "జనాభా నియంత్రణతో పాటుగా మత ప్రాతిపదికన జనాభా సంతులత కూడా కీలకమైన అంశమే, దాన్ని ఎంత మాత్రమూ నిర్లక్ష్యం చేయరాదు." అంటూ తన ప్రసంగాన్ని ముగించారు. భగవత్ ప్రసంగాన్ని, ఆర్ఎస్ఎస్ తీసుకువచ్చిన ఇతర సాహిత్యాన్ని చూస్తే సరిహద్దుల ఆవల నుండి చొరబాట్ల వల్ల ఏర్పడుతున్న 'మతపరమైన అసమానత'పై, బలవంతపు మత మార్పిడులపై ప్రతీసారీ ఆర్ఎస్ఎస్ ఇదే వాదన చేస్తోంది. 1951 నుండి 2011 మధ్య కాలంలో 'భారతీయ మూలాలకు' చెందిన మతాలు 88 శాతం నుండి 83.8 శాతానికి పడిపోగా ముస్లిం జనాభా మాత్రం 9.8 శాతం నుండి 14.22 శాతానినికి పెరిగిందని భగవత్ తన ప్రసంగంలో చెప్పుకొచ్చారు.మతపరమైన మార్పిడి, చొరబాట్ల కారణంగా మతాల మధ్య అసమానత పెరిగిందని, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరీ ఎక్కువగా వుందని, దేశ ఐక్యత, సమగ్రత, సాంస్కృతిక గుర్తింపునకు ముప్పుగా పరిణమిస్తోందని ఆర్ఎస్ఎస్ తీవ్రమైన వాదనలు చేస్తూనే వుంది. ఆర్ఎస్ఎస్ వ్యక్తపరుస్తున్న ఈ రకమైన ఆందోళనే%ొా%వేగంగా జనాభా పెరుగుదల, జనాభా మార్పులపై అధ్యయనం చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలన్న ప్రకటన వెలువడడానికి దారితీసింది. అందువల్ల ఇదేమీ స్వల్పకాలిక ప్రతిపాదనలా కనిపించడం లేదు. పైగా ఈ ఉన్నత స్థాయి కమిటీలో వుండే సభ్యులెవరో చెప్పలేదు. లోక్‌సభ ఎన్నికలలోగా ఆ కమిటీ నివేదిక అందచేస్తుందని కూడా భావించడం లేదు. కాబట్టి కొత్త జనాభా నియంత్రణ విధానమనేది మోడీ మూడవ దఫా పదవీ కాలంలో అమల్లోకి తీసుకురాబోయే ప్రాజెక్టుగా వుంటుందని భావించాల్సి వుంటుంది.ఆర్ఎస్ఎస్ ప్రచారం చేస్తున్న మతపరమైన అసమానతలకు, ముస్లిం జనాభా వేగంగా వృద్ధి చెందుతుండడంతో నెలకొన్న భయాందోళనలకు ఎలాంటి శాస్త్రీయమైన డేటా ఆధారం లేదు. 2019-21లో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, హిందూ (ఒక్కో మహిళకు 1.94 మంది పిల్లలు), ముస్లిం మహిళ (ఒక్కో మహిళకు 2.36 మంది పిల్లలు)ల్లో సంతానోత్పత్తి రేటులో తేడా కేవలం ఒక్కో మహిళకు 0.42 శాతంగా మాత్రమే వుంది. ముస్లిం మహిళల్లో సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గిపోతోంది. 1990-92లో మొదటిసారిగా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే చేసినపుడు ఇది 3.39గా వుండేది. ఇప్పుడు 2.36కి పడిపోయింది. గత రెండు దశాబ్దాల్లో కనిపించిన ధోరణిని చూసినట్లైతే, హిందువుల్లో సంతానోత్పత్తి రేటు 30 శాతం మేరకు తగ్గగా, ముస్లింలలో 35 శాతం మేర తగ్గింది. వాస్తవానికి, గత 20 ఏండ్లలో చూసినట్లైతే హిందువుల్లో కన్నా ముస్లింలలో జనాభా వృద్ధి రేటు బాగా క్షీణించింది. బహుశా 2030కల్లా హిందూ-ముస్లిం మహిళల సంతానోత్పత్తి రేట్లు ఒకే రీతిలో వుండే అవకాశముంది.జనాభా నియంత్రణపై బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఆలోచన, కొత్త జనాభా విధానం ఈ రెండూ పరస్పర విరుద్ధమైన ప్రేరణలను కలిగిస్తున్నాయి. ఒకవైపు, హిందూత్వవాదులు జనాభా పెరుగుదలను అరికట్టాలని కోరుకుంటున్నారు. అప్పుడే వర్ధమాన దేశం వనరులు ప్రజల అవసరాలకు సరిపోతాయని భావిస్తున్నారు. నరేంద్ర మోడీ 2019లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేస్తూ 'జనాభా విస్ఫోటనం' తీవ్రంగా ఆందోళన కలిగిస్తోందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో, మతపరమైన అసమానతలను అరికట్టేందుకు ముస్లిం జనాభా వృద్ధి రేటును కట్టడి చేయాల్సిన అవసరం వుందంటూ ఆర్ఎస్ఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌కు సరిహద్దుల్లో గల అస్సాం, పశ్చిమ బెంగాల్‌లో జనాభా మార్పుల గురించి ఆర్ఎస్ఎస్ ప్రత్యేకంగా ఆందోళన చెందుతోంది. ఉత్తరప్రదేశ్‌లో, కొత్త జనాభా విధానానికి ముందస్తు సూచికను 2021లో ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రకటించింది. 'జనాభా విధానం 2021-2030' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. దాని ప్రకారం, వివిధ కమ్యూనిటీల మధ్య జనాభా సమతూకం వుండేలా చూసేందుకు హామీ కల్పించేలా ప్రయత్నాలు చేపడతారు. ఒక్కో కుటుంబానికి ఇద్దరు పిల్లలు వుండేలా ఈ డాక్యుమెంట్‌లో కొన్ని రాయితీలు, ప్రోత్సాహకాలతో ప్యాకేజీ ప్రతిపాదించారు. ప్రభుత్వ పథకాల్లో ముస్లిం లబ్ధిదారుల విషయానికి వస్తే వీటిని ఆదిత్యనాథ్ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందని భావించవచ్చు. ఇక్కడ హిందూత్వ శక్తుల అసలు బాధ వేగంగా జనాభా పెరగడం గురించి కాదు. చొరబాట్లు, మత మార్పిడులను పరిశీలనలోకి తీసుకుంటే ముస్లిం జనాభా వృద్ధి రేటు అధికంగా వుందని భావించడం. అందువల్లే, హిందూత్వ ప్రాతిపదిక జనాభా విధానాన్ని రూపొందించడానికి కసరత్తు జరుగుతోందని అర్థమవుతోంది.ప్రతి పదేండ్లకోసారి జరగాల్సిన జనాభా లెక్కల నిర్వహణను మోడీ ప్రభుత్వం ఎందుకు చేపట్టలేదో దీనివల్ల అర్థమవుతోంది. 2021లోనే జనగణన జరగాల్సి వుంది. కనీసం 2022లో కోవిడ్ తర్వాతనైనా లేదా 2023లోనైనా చేపట్టాల్సి వుంది. పౌరసత్వ హక్కులు సంపాదించుకోకుండా, భూములు కొనుగోలు చేయకుండా చొరబాటుదారులను నిలువరించేందుకు జాతీయ పౌర రిజిస్టర్‌ను రూపొందించాలని ఆర్ఎస్ఎస్-బీజేపీ జోడీ భావిస్తోంది. జాతీయ జనాభా రిజిస్టర్‌ను ఏర్పాటు చేయడం జాతీయ పౌరుల పట్టికను ఏర్పాటు చేసే దిశగా ప్రాథమిక చర్యగా వుంది. పౌరసత్వ (సవరణ) చట్టాన్ని ఆమోదించే సమయంలో జాతీయ పౌరుల రిజిస్టర్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటించింది. 2021 జనగణనలో జాతీయ జనాభా రిజిస్టర్‌ను ఆధునీకరిస్తామని కూడా ప్రకటించింది.అందువల్ల, తాము చెబుతున్న మతపరమైన అసమానతలను అరికట్టేందుకు కొత్త జనాభా నియంత్రణ విధానం ముసుగులో ముస్లిం జనాభాను వారు లక్ష్యంగా చేసుకుంటారు. జాతీయ జనాభా రిజిస్టర్, జాతీయ పౌరుల నమోదు ఆధారంగా మతపరమైన గుర్తింపుపై ఆధారపడి పౌరసత్వంపై అణచివేతలు అమలు చేస్తారు. 'భారతీయేతర' జనాభాను దిగ్గోయాలనే ఆర్ఎస్ఎస్ పథకం పకడ్బందీగా అమలవుతుంది. బడ్జెట్ ప్రసంగంలో మంత్రి నిర్మలా సీతారామన్ ఉన్నత స్థాయి కమిటీ ప్రకటన ముసుగులో దాగిన అసలైన ఉద్దేశమిదే.

# లెఫ్ట్ పార్టీలతో షర్మిల రైట్ రైట్!



అమరావతి: వైసీపీ, టీడీపీ-బీజేపీకి తొత్తులుగా మారామన్నారు ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల. ఆంధ్ర రాష్ట్ర హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ హక్కుల కోసం తమ పార్టీ పోరాడుతోందని, ఈ ప్రయాణంలో భాగంగా వామపక్షాలతో పొత్తు ఉంటుందని తెలిపారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం వామపక్ష పార్టీలతో కాంగ్రెస్ నేతలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. తామంతా ఏపీ ప్రజల కోసం కలిసి పోరాడే అంశంపై చర్చలు జరిపామన్నారు. తామంతా కలిసికట్టుగా పోరాటాలు చేస్తామని చెప్పారు, కలిసికట్టుగా లేకపోతే ఈ పెద్ద పర్వతాలను దించడం అసాధ్యమని షర్మిల అభిప్రాయపడ్డారు. అనంతపురంలో జరిగే సభకు సీపీఐ,సీపీఎంని ఆహ్వానించామన్నారు.

సీట్ల సర్దుబాట్లు ఉంటాయి.. చర్చలు జరుగుతున్నాయి..

ఎన్నికల్లో పొత్తు, సీట్ల సర్దుబాట్లపై చర్చలు జరుగుతున్నాయని షర్మిల అన్నారు. పొత్తులపై త్వరలో అన్ని అంశాల మీద క్లారిటీ వస్తుందన్నారు. కాంగ్రెస్ 2014 అధికారంలో వచ్చి ఉంటే ఆంధ్ర రాష్ట్రానికి 10ఏళ్లు ప్రత్యేక హోదా వచ్చేదన్నారు. హోదా విషయంలో వైసీపీ అధినేత జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు ఇద్దరూ విఫలం అయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చి ఉంటే పోలవరం పూర్తి అయ్యేదన్నారు. ప్రధాని మోదీ తిరుపతిలో మాట ఇచ్చి.. హోదాపై మాట మార్చారని షర్మిల మండిపడ్డారు. తాము రామభక్తులం అని చెప్పుకుంటే సరిపోతుందా ? అని ప్రశ్నించారు. ఇక ఆళ్ల రామకృష్ణ రెడ్డి అంశంలో మాట్లాడుతూ.. రామకృష్ణారెడ్డి నాకు దగ్గర మనిషి అని.. ఆయన ఎక్కడున్నా బాగుండాలని అన్నారు. ఆయన మీద తీవ్ర స్థాయిలో ఒత్తిడులు ఉన్నాయి, ఆయన చెల్లెలిగా నేను అర్థం చేసుకున్నా అని చెప్పారు, ఒక మంచి వ్యక్తి , ఒక రాంగ్ ప్లేస్ లో ఉన్నారని వ్యాఖ్యానించారు. సీపీఎం కార్యదర్శి వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. బీజేపీ ఈ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. బీజేపీ, వైసీపీ, టీడీపీ మీదనే తమ పోరాటం ఉంటుందన్నారు. ఈ కూటములు రాష్ట్రాన్ని ఘోరంగా మోసం చేశాయని విమర్శించారు.

బీజేపీ పొత్తు కోసం బాబు పొర్లు దండాలు..

ఒక్క శాతం కూడా ఓటు షేర్ లేని బీజేపీ రాష్ట్రాన్ని శాసిస్తోందని సీపీఎం నేత వి. శ్రీనివాసరావు అన్నారు. బీజేపీ మీద దుమ్మెత్తి పోసిన చంద్రబాబు.. ఇప్పుడు వారి పొత్తు కోసం పొర్లుదండాలు పెడుతున్నారని విమర్శించారు. బీజేపీ ముఖ్యమంత్రులు కూడా ఇన్నిసార్లు డిల్లీ చుట్టూ తిరగడం లేదన్నారు. ఇన్నిసార్లు తిరిగినా ఒక్క హామీ కూడా అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి నిధులు లేవని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ సహకారం తీసుకుంటామన్నారు. అందరం కలిసికట్టుగా ఎన్నికల్లో పోటీ చేస్తాం అని స్పష్టం చేశారు. ఈ దుష్ట కూటమిని ఓడిస్తామన్నారు. బీజేపీనీ, బీజేపీకి కాపుగాసే వారిని సాగనంపుతామని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

బీజేపీ పాలనలో ప్రమాదంలో దేశం..

బీజేపీ పాలనలో దేశం ప్రమాదంలో పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. బీజేపీ మత తత్వ రాజకీయాలు చేస్తోందన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలో వస్తే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మారుస్తారని ధ్వజమెత్తారు. దేశం అత్యంత ప్రమాదంలో ఉందన్నారు. ప్రధాన ప్రాంతీయ పార్టీలు బీజేపీకి భయపడుతున్నాయని చెప్పారు. జగన్, బాబు, జనసేన అధినేత పవన్ కూడా మోదీకి దాసోహం అంటున్నారని రామకృష్ణ విమర్శించారు. తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్నిబీజేపీ దగ్గర తాకట్టు పెట్టారని మండిపడ్డారు. ఇతర ప్రజాతంత్ర పార్టీలను కూడా కలుపుకుపోతామన్నారు. దేశంలో బీజేపీ మళ్ళీ అధికారంలోకి రాకూడదనేది తమ లక్ష్యం అన్నారు. జగన్ 5 ఏళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని విమర్శించారు.

# హాట్ సీట్ కుప్పం! వైసీపీలో ఆశల జడి .. టీడీపీ ఉక్కిరి బిక్కిరి



చిత్తూరు : కుప్పం..కుప్పం సీఎం జగన్ నోటిలోనూ ఇన్ చార్జి మంత్రి పెద్దిరెడ్డి రాజకీయ చర్యల్లోనూ కుప్పం నియోజకవర్గ రాజకీయంపై ప్రత్యేక దృష్టి సారిస్తే.. మరో వైపు 40 ఏళ్లుగా కుప్పం చక్రవర్తిగా చెలామణి అవుతున్న చంద్రబాబు సైతం అంతర్గత మధనంలో తర్జనభర్జన పడుతున్నారంటే%ౌ% అతిశయోక్తి కాదు. ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రత్యర్థి పార్టీలు వైసీపీ, టీడీపీలో కుప్పం నియోజకవర్గమే మార్మోగిపోతోంది. నియోజకవర్గంలో చంద్రబాబు గెలుపు ఓటములపైనే అందరి దృష్టి కేంద్రీకృతం కావటమే కాదు%ౌ% బెట్టింగ్ బుకీలకు పెద్ద ఆయుధమే దొరికింది. కోట్లకు కోట్ల బెట్టింగులు తెరమీదకు వస్తున్నాయి. ఎక్కడ నలుగురు గుమి కూడినా కుప్పంలో రాజకీయ పరిస్థితులపైనే వాడి వేడిగా చర్చ జరుగుతోంది. కుప్పం ప్రజలు ఎప్పటిలాగే రానున్న ఎన్నికల్లో కూడా చంద్రబాబును ఆదరిస్తారా అనే అంశంపైనే చర్చ తారా స్థాయికి చేరింది. ఈ విషయంపై చిత్తూరు జిల్లాలోనే కాదు అటు తెలంగాణ%ౌ% ఇటు ఆంధ్ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. కుప్పంలో పరిస్థితులు చంద్రబాబుకు ప్రతికూలంగా కనిపిస్తున్నాయని, అభివృద్ధి సంక్షేమంతో ఈసారి తామే గెలుస్తామని అధికార పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తుంటే.. ఎలాంటి ప్రచారం లేకుండా ఈసారి లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తామని టీడీపీ నాయకులు తొడలు చరచటం ఆసక్తికరంగా మారింది.

కుప్పంలో గతమెంతో

కుప్పంలో రాజకీయ పరిస్థితులు గతం కన్నా.. భిన్నంగా మారుతున్నాయని దాని ఫలితంగా రానున్న ఎన్నికల్లో చంద్రబాబు అంచనాలు తారుమారు కావచ్చనే అభిప్రాయం రాజకీయ పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది. కుప్పం నియోజకవర్గంలో నిన్న మొన్నటి వరకు కంటిన్యూ అవుతున్న సుమారు 20 వేలకు పైగా పక్క రాష్ట్రానికి చెందిన దొంగోట్లను గుర్తించి వాటిని అధికార పార్టీ తొలగించడం ఒక ఎత్తయితే, ఒకప్పుడు 60 వేల పైచిలుకు చంద్రబాబు మెజారిటీ గత ఎన్నికల్లో 30 వేలకు పడిపోవడం చూస్తుంటే పరిస్థితులు పూర్తిగా మారాయని రాజకీయ విశ్లేషకులు అనుమానిస్తున్నారు. అంతేకాకుండా కుప్పంలో తమకు ప్రతికూల పవనాలు వీస్తున్నాయనే విషయాన్ని పసిగట్టిన చంద్రబాబు రానున్న ఎన్నికల్లో కుప్పంనే నమ్ముకుంటే నట్టేట మునిగిపోతామనే ఆలోచనతో ప్రత్యామ్నాయంగా భీమిలిలో కూడా పోటీ చేయాలనే యోచనలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు తీసుకొనే ప్రత్యామ్నాయ నిర్ణయాన్ని కుప్పం ప్రజలు ఆమోదిస్తారా.. మౌనంగా తిరుగుబాటు తీర్పిస్తారా.. అనే విషయాలపై కూడా తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

రెండు సీట్లపైనే అనుమానాలు

ప్రత్యామ్నాయంగా మరో సీటులో పోటీ చేస్తే కుప్పం ప్రజల్లో అనుమానం ఏర్పడి ప్రతికూలంగా తీర్పుచ్చే అవకాశాలు మెండుగా ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అంతేకాకుండా ఇంతకాలం పాటు గెలిపిస్తూ వచ్చిన మమ్మల్ని అనుమానిస్తావా అనే భావన కుప్పం ఓటర్లలో కలిగితే ఆ తర్వాత చంద్రబాబు పరిస్థితి ఏందనే వాదన కూడా రాజకీయ విశ్లేషకుల్లో వినిపిస్తోంది. ఇక వైసీపీ చిత్తూరు జిల్లాపార్టీ అధ్యక్షుడు, కుప్పం నియోజకవర్గ ఇన్చార్జి ఎమ్మెల్సీ భరత్ ను రానున్న ఎన్నికల్లో మీరు ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపితే తాను అతడిని మంత్రిగా చేసి మీకు గిఫ్ట్ ఇస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇదివరకే పలుమార్లు కుప్పం ప్రజలకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాకుండా జిల్లాకు చెందిన మంత్రి పెద్దిరెడ్డిని వీలైనంతవరకు ఎక్కువ సమయం కుప్పం పైనే దృష్టి సాధించే విధంగా జగన్మోహన్ రెడ్డి పావులు కలుపుతున్నారు. వీటి పర్యవసానంగా రెండేళ్ల కిందట జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను అధికార పార్టీ కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. వీటి ఫలితంగా కుప్పం నియోజకవర్గంలో అధికార పార్టీ ఊహించని విధంగా బలపడుతూ వస్తోందని చెప్పడానికి పలు ఆధారాలు కనిపిస్తున్నాయి. వీటిని అంచనా వేసుకున్న చంద్రబాబుకునేడు సందిగ్ధ పరిస్థితులు తప్పడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

20 వేలకు పైగా దొంగ ఓట్లు రద్దు ..

కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికే రెండు పర్యాయాలుగా దొంగ ఓట్లను తొలగించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు 12 వేలకు పైగా దొంగ ఓట్లను అధికార యంత్రాంగం తొలగించిన విషయం తెలిసిందే. అయితే ఇవన్నీ పక్కనున్న తమిళనాడు కు చెందిన దొంగ ఓట్లుగా అధికారులు గుర్తించి వాటిని తొలగించారు. తాజాగా గత నెలలో 8,778 ఓట్లను జిల్లా అధికారులు తొలగించారు. మొత్తం కలిపి 20,778 దొంగ ఓట్లను గుర్తించి రద్దు చేశారు. ప్రస్తుతం దొంగ ఓట్లుగా గుర్తించి రద్దు చేసిన ఓట్లన్నీ గతంలో చంద్రబాబుకు పోలవుతోందిన ఓట్లని వైసీపీ నాయకుల ఆరోపణ.

.స్థానిక సంస్థల్లో వైసీపీకి తిరుగులేని బలం

కుప్పం నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా వైసీపీ బలపడిందని గత ఎన్నికల్లో పోలైన ఓట్ల గణాంకాలే చెబుతున్నాయి. గతంలో కుప్పంలో ఏ ఎన్నిక జరిగినా తెలుగుదేశం అభ్యర్థులే గెలిచారు. అయితే ఆ చరిత్రను తిరగరాస్తు రెండేళ్ల కిందట జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను వైసీపీ గెలుచుకొని కుప్పంలో టీడీపీని చావు దెబ్బ కొట్టింది. 89 గ్రామపంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో 74 స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. అదేవిధంగా 82 ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 76 స్థానాలను వైసీపీ గెలుచుకుంది. స్థానిక సంస్థల్లో కీలక పాత్రను పోషించే మండల పరిషత్తు అధ్యక్షులు, జిల్లా పరిషత్తు సభ్యుల ఎన్నికల్లో కూడా నాలుగు ఎంపీపీ స్థానాలు, నాలుగు జడ్పిటిసి స్థానాలను వైసిపి గెలుచుకొని టీడీపీని మట్టి కరిపించింది. . అదేవిధంగా వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుప్పం నియోజకవర్గంలో కొత్తగా మున్సిపాలిటీ ఏర్పాటు చేసి అందులో నిర్వహించిన ఎన్నికల్లో 25 కౌన్సిలర్ స్థానాలకు గాను 19 కౌన్సిలర్లను వైసీపీ గెలుచుకొని విజయదుందుభి మోగించడంతో కుప్పం నియోజకవర్గంలో వైసీపీ అనుకోనంత బలపడింది. ఈ నేపథ్యంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక సంస్థల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులంతా తమ పార్టీ అభ్యర్థి కోసం పనిచేస్తే తప్పక విజయం సాధిస్తామని ధీమాతో పార్టీ అధిష్టానం అంచనాలు వేస్తోంది. ఐతే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎప్పుడూ అధికార పార్టీకే బలం చేకూరుతుంది, స్థానిక నాయకత్వం కోసం ఆధిపత్య ఆరాటంతో అధికార పార్టీకే జనం మొగ్గు చూపుతారు. మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికల్లో .. ఊరూర కులం, ధనం ప్రభావం ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల్లో ఈ స్థితి మారుతుంది. చంద్రబాబును కుప్పం ప్రజలు దూరం చేసుకుంటారా? లేక ఆదుకుంటారా? రానున్న ఎన్నికలే చంద్రబాబు తలరాతను ఏ రీతిలో ఉ ంటుందో? అంచనాలకు అందని ప్రశ్నలే.

# జిఎస్టీతో కుదేలవుతున్న జనం..ప్రాంతీయ పార్టీలకు పొగపెడుతున్న మోడీ

న్యూఢిల్లీ,ఐదురాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ఫలితాలు బిజెపికి అనుకూలంగా ఉన్న వేళ రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో తమకు ఢోకా లేదన్న ధీమాలో బిజెపి ఉంది. అందుకే సామాన్యుల బాధలు పట్టడం లేదు. సమస్యలు చర్చించడం లేదు. ప్రధానంగా పెట్రోల్ ధరలు పెరగడం... జిఎస్టీ స్లాబులు పెరగడం లాంటివి భారంగా మారిన చర్చించడం లేదు. రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీసి రాజకీయంగా లబ్దిపొందాలన్న దురాలోచనలో కేంద్రం ఉన్నట్లు కనపడుతోందని విపక్ష కాంగ్రెస్ విమర్శిస్తోంది. బయటకు కనిపించకున్నా ఆర్థికంగా అనేక రాష్ట్రాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు న్నాయి. తమ అనుకున్న రీతిలో రాష్ట్రాలను ఊబిలోకి దించి విద్యుత్, ఆర్థిక సంస్కరణలను అమలు చేయాలన్న ప్రణాళిక వేస్తున్నారు. మోడీ దృష్టిలో ఎంత మేరకు ఆదాయం రాబట్టామనే లెక్కలు వేసుకుంటున్నారు. జిఎస్టీ ఆదాయాన్ని విజయంగా చూస్తున్నారు. దీంతో ప్రజలు పడుతున్న బాధలు కనిపించడం లేదు. అయితే దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానాన్ని ప్రవేశ పెట్టాలనే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వాల కాలం నుంచే మొదలయ్యింది. యూపిఎ హయాంలో జిఎస్టీ తీసుకుని రావాలన్న నిర్ణయాన్ని ఆనాడు ప్రస్తుత బిజెపి పాలకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుతం ప్రధానిగా ఉన్న మోడీ కూడా గుజరాత్ సిఎం హోదాలో తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది రాష్ట్రాల హక్కులను హరిస్తుందని, ప్రజలపై భారం పడుతుందని వాదించారు. కానీ తాను ప్రధాని అయ్యాక దీనిని బలవంతంగా ప్రజలపై రుద్దారు. ఇప్పుడు జిఎస్టీతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామో అనుభవంలోకి వచ్చింది. ఒకేరకమైన పన్ను విధానంతో రకరకాల పన్నులు పోయి ఒకటే విధానం ఉంటుందని,సులభంగా కూడా ఉంటుందని ఆనాడు మోడీ వాదించారు. మోడీ వచ్చాక జిఎస్టీని పట్టుబట్టి అమలు చేయడంతో కేంద్రం పక్కా వ్యాపార ధోరణితో ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తోంది. వివిధ దేశాలలో ఒకే రకమయిన పన్ను విధానం ఉండడం ప్రపంచీకరణకు అనుకూల వాతావరణాన్ని కలిగిస్తుందన్న భావనతో, పన్ను సంస్కరణలు మొదలయ్యాయి. కానీ అమెరికా వంటి దేశంలో కూడా జిఎస్టికి చుక్కెదు రయింది. అక్కడ వారికి ఒకే విధానం కంటె, రాష్ట్రాల ప్రతిపత్తే ముఖ్యం అన్న విధాంలో ఉన్నారు. దీర్ఘకాలం జిఎస్టిపై జరిగిన చర్చలలో రాష్ట్రాల హక్కులకు హాని కలుగకుండా సంస్కరణను ఎట్లా సాధ్యం చేయాలన్న అంశంపై వాదోపవాదాలు జరిగాయి. కొత్త విధానంలోకి మారిన వెంటనే కలిగే నష్టానికి పరిహారం చెల్లిస్తామని కేంద్రం వాగ్దానం చేసింది. జిఎస్టి విధానం అమలు మొదలైన తరువాత, కరోనా ఇబ్బందుల కాలంలోనూ పన్ను వాటా ఆదాయం గణనీయంగా తగ్గిపోయిన సందర్భంలో పరిహారం ఇవ్వడానికి కేంద్రం ఎన్నో మెలికలు పెట్టింది. చివరకు కొంత ఇచ్చింది కానీ, ఇవ్వవలసినంత మాత్రం ఇవ్వలేదు. రాష్ట్రాలను ఇబ్బంది పెట్టడానికి ఆర్థిక కేటాయింపులను వాడడంలో ప్రస్తుత కేందప్రభుత్వం రాజకీయ వ్యూహం చూపుతున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రతిపక్ష రాష్ట్రాల విషయంలో నిధుల కేటాయింపులు, అనుమతుల విషయంలో పక్షపాతం చూపడం, దానికి ప్రతిస్పందనగానే ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించడం జరిగింది. బిజెపి ప్రభుత్వం, తీవ్రజాతీయత సహాయంతో ప్రాంతీయ శక్తులను బలహీనపరచడానికి, రాష్ట్రాలను పరాధీనం చేయడానికి ప్రయత్నిస్తున్నదని వామపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఒకే దేశం, ఒకే పన్ను, ఒకే పరీక్ష, చివరకు ఒకే ఎన్నికల దాకా పరిస్థితి వెడుతున్నది. జిఎస్టి పరిహారం సందర్భంలో, తాము కోరుతున్న సంస్కరణలను అమలు చేయడాన్ని ఒక షరతుగా పెట్టడం చూశాం. మొత్తం ఆదాయం కేంద్రం నుంచి మాత్రమే రావలసి వస్తే, ఇక రాష్ట్రాలకు సొంత విధానాలు అంటూ ఏమీ మిగలవు. తాజాగా అలాంటి పరిస్థితులు కల్పిస్తున్నారు. రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీయడం ద్వారా అక్కడ పాగా వేయాల న్నది మోడీ నేతృత్వంలోని బిజెపి ప్లాన్‌గా ఉంది. ప్రజల్లో ప్రాంతీయ పార్టీలను చులకన చేసి లేదా మరో రకంగా అధికారం కబ్జా చేయాలని చూస్తున్నారని కాంగ్రెస్, లెఫ్ట్ నేతలు ఆరోపిస్తున్నారు. జిఎస్టీ సవరణలు కోరినా పట్టించుకోవడం లేదు. అలాగే ఇటీవల చేనేతపైనా భారీగా జిఎస్టీ పెంచాలని చూశారు. అయితే రాష్ట్రాలు వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారు. జిఎస్టీ వల్ల కలుగుతున్న ఇబ్బందులను తర్కించి, చర్చించాలని ఆయా పార్టీలు కోరినా లాభం లేకుండా పోతోంది.




# సామాన్యుడి సంక్షేమానికి కెసిఆర్ పెద్దపీట



నిజామాబాద్,బిఆర్ఎస్ పాలనలో వ్యవసాయం బాగుపడిందని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దానిని కొనసాగించే విషయంలో ప్రస్తుత ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. ఉన్న జలాశయాలను వాడుకుని నీటిని పొలాలకు మళ్లించాలన్న దృష్టి పెట్టడం లేదన్నారు. కేవలం చిన్నిచిన్న పొరపాట్లను చూపి, గత పాలనను విమర్శించడం పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. నిజానికి మల్లన్న సాగర్ సాకారంతో కాళేశ్వరం కల పూర్తిగా సాకారం అయ్యిందన్నారు. తెలంగాణను కోటిఎకరాల మాగాణిగా తీర్చిదిద్దాలని నాటి సీఎం కేసీఆర్ కృషి చేసారని, అద్భుత పాలనతో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. ప్రస్తుత అధికార కాంగ్రెస్ నేతలు అదేపనిగా విమర్శలు మాని,మల్లన్న సాగర్‌ను, కొండపోచమ్మ సాగర్‌ను చూస్తే నీటి రాక ఎలా ఉ ందో తెలుస్తుందన్నారు. ప్రాజెక్టులకు నిధులతో సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కాగితం పులులు, సోషల్‌మీడియాలో దుష్ప్రచారంతో పబ్బం గడుపుతున్న అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల కోసమే ఆలోచించే ప్రభుత్వమని రుజువైందని తెలిపారు. అనేక సంక్షేమకార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ఐటీ రంగంలో మెరుగైన ప్రగతిని సాధించుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌ను దేశంలోనే సురక్షితమైన నగరంగా తీర్చిదిద్దామన్నారు. విమర్శలు చేస్తున్న బిజెపి,కాంగ్రెస్ నేతలు తమ పాలనలో ఏం చేసిందో చెప్పాలన్నారు. పెట్రో ధరలు పెంచడం తప్ప బిజెపి చేసిందేమీ లేదన్నారు. కెసిఆర్ హయాంలో పేదల సంక్షేమం కోసం ప్రతి ఏటా రూ. 40వేల కోట్లు కేటాయింపులు చేసినట్లు తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ అర్హత 65 ఏళ్ల నుంచి 57 ఏళ్లకు తగ్గింపు చేయడం జరిగిందని, ఒంటరి మహిళలు, దివ్యాంగుల, వితంతువుల పెన్షన్లు రెట్టింపు చేశామన్నారు. రైతులకు ఏడాదికి రూ. పదివేల పంట పెట్టుబడి ఇచ్చామని, అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిపామని అన్నారు. అయితే ఈ పదేళ్ల కాలంలో ఏమీ చేయలేదన్న రీతిలో బురదజల్లే కార్యక్రమం చేపట్టడం తగదని అన్నారు. ఇది ప్రజలు కూడా జీర్ణించుకోలేరని అన్నారు. కుల, మతాలతో సంబంధం లేకుండా డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వం దని మాజీమంత్రి అన్నారు. రైతుల అభివృద్ధి కోసం రూ. 50 వేల కోట్లకు పైగా కేటాయించడం గొప్ప విషయమని, తద్వారా రైతుల ఆత్మహత్యలు, ఆకలి చావులు నిర్మూలించగలిగామని అన్నారు. వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని, తెలంగాణ ఏర్పడితే కరెంట్ ఉండదని సమైక్య పాలకులు భయపెట్టారని, కేసీఆర్ కృషితో 24 గంటల నిరంతర నాణ్యమైన కరెంట్ అందివ్వగలిగామని అన్నారు. చిన్న మండలాలు, జిల్లాల ఏర్పాటుతో అభివృద్ధి ఫలాలు ప్రతిఒక్కరికి అందుతున్నాయని అన్నారు.

# మహువా మొయిత్రాకు షాక్



న్యూఢిల్లీ : విదేశీమారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) కింద తనపై దర్యాప్తునకు సంబంధించి మీడియాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నుండి 'రహస్య' సమాచారం లీక్ కాకుండా చూడాలన్న తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నేత మహువా మొయిత్రా అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం ప్రసాద్ తీర్పు వెలువరిస్తూ, 'కొట్టివేయడమైంది' అని తెలిపారు. 'ప్రస్తుతం సాగుతున్న దర్యాప్తునకు సంబంధించి ప్రింట్/ ఎలక్ట్రానిక్ మీడియాకు ఎటువంటి రహస్యం, సున్నిత, నిర్ధారితం కానీ/ధ్రువీకరణకాని సమాచారంతో సహా ఎటువంటి సమాచారాన్నీలీక్ చేయకుండా' దీనిని నిరోధించాలని హైకోర్టును మొయిత్రా అభ్యర్థించారు. 'పిటిషనర్‌కు జారీ చేసిన ఫెమా సమన్ల కింద ప్రతివాది నంబర్ 1 (ఇడి) సాగిస్తున్న దర్యాప్తునకు సంబంధించి ఎటువంటి సమాచారాన్నీ లీక్ చేయకుండా, ప్రచురించకుండా/ ప్రసారం చేయకుండా' పలు మీడియా సంస్థలను నిరోధించాలని కూడా హైకోర్టుకు ఆమె విజ్ఞప్తి చేశారు. అంతకు మొయిత్రా వాద సీనియర్ న్యాయవాది కోర్టులో ఇస్తూ, మొయిత్రాను 'వేటాడుతున్నార'ని, ఫెడరల్ ఏజెన్సీకి సమన్లు జారీ చేసిన వాటిని ఆమె అందుకోవడానికి ముందే ప్రచురితమైందని తెలిపారు.

## వాజేడు వద్ద రోడ్డు ప్రమాదం: ఇద్దరు మృతి

ములుగు, ములుగు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లారీని వ్యాన్ ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన వాజేడు మండలం జగన్నాథపురం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. మృతుల్లో ఒకరు సీఆర్పీఎఫ్ జవాన్ తిరుమల్‌గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మేడారంలో జోరుగా మేకలు,కోళ్ళ విక్రయాలు

ములుగు, మేడారం జాతర లో జోరుగా మేకలు, కోళ్ళ విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. మేడారం మహా జాతరలో సమ్మక్క సారలమ్మలకు భక్తులు తాము కోరిన కోర్కెలు తీర్చితే ఎత్తు బంగారం తో పాటు మేకలు, కోళ్లు బలి ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటామని మొక్కుకుంటారు. అంతే కాకుండా భక్తులు అమ్మవార్ల దర్శనం అనంతరం కోళ్ళను ఎదురుఇచ్చి ఎదురు కోళ్ళు చేయడం ఆనవాయితీ. సమ్మక్క, సారలమ్మలు గద్దె కు చేరే సమయంలో సైతం ఉగ్రరూపంలో ఉన్న అమ్మవార్లను శాంత పరిచేందుకు కోళ్ళను ఎదురు ఇచ్చి బలిస్తూ ఉంటారు. జాతరకు దేశం నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సమ్మక్క సారలమ్మ లకు మెక్కులు చెల్లించుకొని మేకలు,కోళ్ళను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. క్రమంలో మేడారం జాతర పరిసరాల లో మేకలు,కోళ్ళ విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని వ్యాపారులు చెపుతున్నారు.



Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com